ప్రజాశక్తి
మంగళవారం 3 డిసెంబర్ 2024
8 పేజీలు



ఎన్‌టిఆర్



కృష్ణా

విజయవాడ మెట్రోకు గ్రీన్‌సిగ్నల్



- మొదటి దశలో 38.40 కిలోమీటర్లకు రూ.11,009 కోట్ల అంచనా
- ఎ కారిడార్‌లో 22, బి కారిడార్‌లో 12 స్టేషన్ల ప్రతిపాదన
- కేంద్రం ఆమోదమే ఆలస్యం
- గతంలో తిరస్కరణ

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

విజయవాడ-అమరావతి మెట్రో మొదటి దశ సమగ్ర నివేదిక (డిపిఆర్)కు రాష్ట్ర ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. గన్నవరం బస్టాండ్ నుంచి విజయవాడ పిఎన్‌బిఎస్ వరకు 25.926 కిలోమీటర్లు మొదటి ఫేజ్ ఎ కారిడార్, విజయవాడ పిఎన్‌బిఎస్ నుంచి పెనమలూరు వరకు మరో 12.020 కిలోమీటర్లు మొడటి ఫేజ్ బి కారిడార్‌ల నిర్మాణానికి రూపొందించిన డిపిఆర్‌ను ప్రభుత్వం ఆమోదించింది. మొత్తం 38.40 కిలోమీటర్లు ఎ, బి కారిడార్‌ల నిర్మాణానికి రూ.11,009 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. దీనిలో 91 ఎకరాల భూ సేకరణకు రూ.1,152 కోట్లు వ్యయం చేయాల్సి వస్తుందని నివేదికలో కన్సలెన్సీ సంస్థ పేర్కొంది. గన్నవరం, పిఎన్‌బిఎస్ మధ్య 22, పిఎన్‌బిఎస్, పెనమలూరు మధ్య 12 మెట్రో స్టేషన్‌ల నిర్మాణానికి ప్రతిపాదించింది. ట్రాక్ మధ్య ఉండే వెడల్పు ఆధారంగా దీన్ని లైట్ మెట్రోగా పేర్కొంది. రెండో దశలో రాజధాని అమరావతి వరకు లైట్ మెట్రోను విస్తరించడానికి నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

కేంద్రం నిధులా...పిపిపిలోనా?

రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించిన డిపిఆర్‌ను కేంద్రానికి పంపాల్సి ఉంది. కేంద్రం ఆమోదం తర్వాతే దీని నిర్మాణం చేపట్టాలి. రాష్ట్ర విభజన హామీల్లో భాగంగా కేంద్రం విజయవాడ-అమరావతి మెట్రో రైల్ కారిడార్‌లను నిర్మిచాల్సి ఉంది. (మిగతా 2లో)

విద్యుత్ భారాలపై పోరుకు సిద్ధం కండి

- మాట తప్పిన కూటమి ప్రభుత్వం
- అదానీకి దోచిపెడుతున్న పాలకులు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బాబూరావు
- విజయవాడలో విద్యుత్ బిల్లుల పరిశీలన

ప్రజాశక్తి-విజయవాడ

రాష్ట్రంలో టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదు నెలల తిరగకముందే రూ.15,484 కోట్లు విద్యుత్ భారాన్ని ప్రజలపై మోపడం దారుణమని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు మరో విద్యుత్ పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. విజయవాడ అజిత్ సింగ్‌నగర్ 58వ డివిజన్ తదితర ప్రాంతాల్లో సిపిఎం నాయకులు సోమవారం పర్యటించారు. ఈ నెల వచ్చిన విద్యుత్ బిల్లులను పరిశీలించారు. ప్రజలతో మాట్లాడారు. పెరిగిన విద్యుత్ బిల్లులు, మాట తప్పిన ప్రభుత్వ తీరును, అదానీతో కుమ్మక్కైన పాలకుల కుట్రలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ 2022-23 సంవత్సరాల్లో వినియోగించుకున్న విద్యుత్‌పై రూ.6072 కోట్ల సర్దుబాటు ఛార్జీల పేరుతో జనం నుండి వసూలు చేయడంపై మండిపడ్డారు. వచ్చే నెల నుండి 2023-24 సర్దుబాటు ఛార్జీ రూ. 9412 కోట్ల భారం రాష్ట్ర ప్రజలపై పడనుందని అన్నారు. ఇప్పటికే 2014-19 ట్రూ అప్ ఛార్జీ, గత నెల బిల్లులపై 40 పైసలు చొప్పున సర్దుబాటు (మిగతా 2లో)



విద్యుత్ బిల్లులను పరిశీలిస్తున్న బాబూరావు

అక్రమ చెరువుల తవ్వకాలు

- పెడన జింజేరులో 60 ఎకరాల మడ అడవుల అక్రమణ
- నేలకొండపల్లిలోని దేవాలయ భూముల్లోనూ తవ్వకాలు
- సమస్యలపై మీ కోసంలో వినతులు

ప్రజాశక్తి-కృష్ణాప్రతినిధి

అక్రమాలు సహించమని ప్రభుత్వం చెబుతున్న మాటలు ఆచరణలో నీటిమూటలవుతున్నాయి. మడ అడవులు, దేవస్థానం భూముల్లో అక్రమంగా చెరువుల తవ్వకాలు యథేచ్చగా సాగిపోవడం దీనికి నిదర్శనంగా నిలుస్తోంది. అక్రమ చెరువుల తవ్వకాలతో తమ వ్యవసాయ భూములకు ముంపు ముప్పు ఏర్పడిందని, చౌడు బారిపోతున్నాయని సమీప ప్రాంతాల్లోని రైతులు వాపోతున్నారు. ఈ సమస్యలతో పాటు భూ ఆక్రమణలపైన సోమవారం మచిలీపట్నం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (మీ కోసం)లో జిల్లా అధికారులకు పలువురు ఫిర్యాదులు అందించారు. ఈ నాలుగు నెలల్లో పెడన మండలం జింజేరు గ్రామం వద్ద లజ్జబండ డ్రెయిన్ పక్కనున్న 60 ఎకరాల (మిగతా 2లో)



బందరు కలెక్టరేట్‌లో అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ బాలాజీ

ఫీజులు చెల్లించకపోతే హాల్‌టికెట్లు ఇవ్వం

- తేల్చిచెప్పిన వికెఆర్, వివిఎన్‌బి కళాశాల యాజమాన్యం
- ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థుల ఆందోళన



విద్యార్థుల ఆందోళన, ప్రిన్సిపల్‌తో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు



ప్రజాశక్తి-గుడివాడ

ఫీజులు చెల్లించకపోతే విద్యార్థులకు హాల్‌టిక్కెట్లు ఇచ్చేదిలేదంటూ వికెఆర్ వివిఎన్‌బి ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యం తేల్చిచెప్పింది. ఫీజు చెల్లిస్తామని రాతపూర్వకంగా హామీనిస్తేనే హాల్‌టిక్కెట్లు ఇస్తామని చెప్పడంతో ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సమరం మాట్లాడుతూ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్ మెంట్ విడతల వారీగా కళాశాల అకౌంట్లో జమ చేస్తామన్న నిర్ణయాన్ని పాటించకుండా విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న వికెఆర్ వివిఎన్‌బి కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పరీక్షల (మిగతా 2లో)

మొదటిపేజీ తరువాయి

విజయవాడ మెట్రోకు గ్రీన్‌సిగ్నల్

ప్రతిపాదిత స్టేషన్‌లు	కిలోమీటర్లు
గన్నవరం బస్టాండ్	0
గన్నవరం	0.923
యోగాశ్రమం	1.820
ఎయిర్‌పోర్టు	4.140
కేసరపల్లి	6.381
వేల్పూరు	8.486
గూడవల్లి	9.431
శ్రీ చైతన్య కాలేజీ	10.524
నిడమానూరు రైల్వేస్టేషన్	11.870
నిడమానూరు	12.805
ఎనికేపల్లి	14.077
ఎంబిటి కాలనీ	15.244
ప్రసాదంపాడు	16.622
రామవరప్పాడురింగ్	17.682
గుణదల	19.071
పడవలరేవు	20.014
మాచవరండౌన్	21.265
సీతారామపురం సిగ్నల్	22.145
బీసెంట్ రోడ్డు	23.240
రైల్వే స్టేషన్ తూర్పు	24.180
రైల్వే స్టేషన్ దక్షిణం	24.823
పిఎన్‌బిఎస్	25.926
కారిడార్ వన్ బిలో స్టేషన్‌లు	
పిఎన్‌బిఎస్	0
జూబ్లీ మ్యూజియం	1.345
మున్సిపల్ స్టేడియం	2.345
టిక్కిల్ రోడు	3.495
బెంజిసర్కిల్	4.440
ఆటోనగర్	5.890
అశోక్‌నగం	6.920
కృష్ణానగర్	7.710
కానూరు సెంటర్	8.465
తాడిగడప	9.725
పోరంకి	10.620
పెనమలూరు	12.020

అయితే 2014-19 మధ్య కాలంలో విజయవాడ మెట్రో లాభసాటి కాదని అప్పట్లో తయారు చేసిన డిపిఆర్‌ను కేంద్రం తిరస్కరించింది. ఈ కాలంలోనే మెట్రో విధానంలోనూ మార్పులు తీసుకు వచ్చింది. లాభసాటిగాని ప్రాంతాల్లో మెట్రోను నిరాకరిస్తోంది. ఈ నేపథ్యంలో కేంద్రం నిధులు కేటాయింపుపై సందేహాలు తలెత్తుతున్నాయి. మరో పక్క రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడులను రాబట్టే పేరుతో ప్రయివేటు పబ్లిక్ భాగస్వామ్యానికి (పిపిపి)కి పెద్ద పీఠ వేస్తోంది. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం విజయవాడ మెట్రోకు కేంద్రం నిధులు తీసుకు వస్తుందా? లేక పిపిపిలో నిర్మాణానికి మొగ్గ చూపుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.



అక్రమ చెరువుల తవ్వకాలు

మడ అడవులను అక్రమించి చెరువులు తవ్వారని, డ్రయిన్ పరిసరాల్లో మిగిలిన భూముల్లోనూ చెరువుల తవ్వకాలకు ప్రయత్నిస్తున్నారని ఆ గ్రామానికి చెందిన మోర్ల శివరామకృష్ణ మీ కోసంలో అధికారులకు తెలిపారు. ఈ మండలంలోని నేలకొండపల్లిలోని 8.88 ఎకరాల గూడూరు వెంకటాచల దేవస్థానం భూముల్లోనూ చెరువులు తవ్వుతున్నారని గ్రామానికి చెందిన సమ్మిట వీరరాఘవయ్య, మట్టా దుర్గాప్రసాద్ వినతిపత్రం అందించారు. ఈ చెరువుల తవ్వకాలతో సమీపంలోని 100 ఎకరాల వ్యవసాయ భూములు చౌడు బారడంతోపాటు ముంపుకు గురయ్యే ప్రమాదం ఏర్పడిందని పిర్యాదు దారులు అధికారులకు తెలిపారు. తమకు చెందిన 19 లింకుల వ్యక్తిగత దారిని ఆక్రమించి ఇతరులు ఇల్లు నిర్మిస్తున్నారని కోడూరు మండలం వి.కొత్తపాలెం గ్రామానికి చెందిన రేపల్లే పిచ్చేశ్వరరావు, తమ స్వంత వ్యవసాయ భూమిలో అక్రమంగా నిర్మించిన సమాధులు తొలగించాలని కంకిపాడు మండలం కుందేరు గ్రామానికి చెందిన పామర్తి జయలక్ష్మిలు వినతులు అందించారు.

అదనపు విద్యుత్ లోడ్ భారం తప్పించండి

ఎస్‌సి కేటగిరీలో 200 యూనిట్లలోపు విద్యుత్ వినియోగిస్తున్నా అదనపు లోడ్ పేరుతో విద్యుత్‌శాఖ తమపై రూ. 5,643 భారం మోపిందని, ఈ మొత్తం చెల్లించలేకపోవడంతో ఇంటి విద్యుత్ కనెక్షన్ తొలగించారని ఘంటసాల పెదగూడెంకు చెందిన కొడాలి కోటినాగులు వాపోయారు. తమ ఇంటికి విద్యుత్ కనెక్షన్ పునరుద్ధరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

పమిడిముక్కల సిఐ కొట్టారు

తమ కుటుంబానికి బతుకు తెరువుగా ఉన్న ఆటోను ప్రమాదానికి గురిచేశారని ఈ సమస్యను డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకెళ్లామని పెనమలూరు మండలం పోరంకి గ్రామానికి చెందిన రాయన జ్ఞానేంద్ర, భార్య అనూషలు అధికారులకు తెలిపారు. పమిడిముక్కల సర్కిల్ ఇన్‌స్పెక్టర్ న్యాయం చేస్తామని స్టేషన్‌కు పిలిచి జ్ఞానేంద్రను కొట్టారని జిల్లా అధికారుల వద్ద భార్యాభర్తలు వాపోయారు.

అర్జీల పరిష్కారంలో రాజీపడొద్దు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయవాడ: ప్రజా సమస్య చిన్నదైనా, పెద్దదైనా సమాన ప్రాధాన్యమిచ్చి గడువులోగా పరిష్కరించాలని, నాణ్యతలో రాజీపడొద్దని జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు.సోమవారం కలెక్టరేట్‌లోని శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్‌ఎస్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డా. నిధిమీనా, డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతితో కలిసి ప్రజల నుంచి 97 అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలనను ప్రజల చెంతకు చేర్చేందుకు అత్యంత ప్రాధాన్యమిస్తోందని.. ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు సమష్టిగా దష్టిపెట్టి నిర్దేశ గడువులోగా పరిష్కరించాలని సూచించారు. అర్జీల పరిష్కార వ్యవస్థ పటిష్ట పర్యవేక్షణకు, అర్జీ స్వీకరించింది మొదలు అర్జీదారుడు సంతప్తి చెందేలా పరిష్కరించేవరకు ప్రతి దశలోనూ పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యమిచ్చేలా, అర్జీ రీఓపెన్ అయిన సందర్భంలో రీవెరిఫికేషన్‌కు శాఖల వారీగా ప్రత్యేక గ్రీవెన్స్ ఆడిట్ అధికారులను నియమించినట్లు వివరించారు.రెవెన్యూబీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు సంబంధించిన అర్జీలకు విజయవాడ, నందిగామ, తిరూవూరు ఆర్‌డీవోలకు ఆడిట్ అధికారులుగా బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు.



ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. పట్టణ ప్రణాళిక విభాగానికి సబంబధించి 5, ఇంజనీరింగ్ 2, ప్రజారోగ్యం 1, రెవెన్యూ 1, హార్టికల్చర్ విభాగానికి సంబంధించి ఒక అర్జీని అధికారులు అందుకున్నారు.



ఎన్‌టిఆర్ జిల్లా ఎఫ్ఎస్ఒగా రవీంద్రరావు బాధ్యతలు

ప్రజాశక్తి-విజయవాడ: ఎన్‌టిఆర్ జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారి (ఎఫ్‌ఎస్ఒ)గా ఎ.రవీంద్రరావు సోమవారం విజయవాడ స్టేట్ గెస్ట్‌హౌస్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశను కలెక్టరేట్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. టీమ్ ఎన్‌టిఆర్‌లో భాగమవుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. గతంలో నందిగామ ఆర్‌డిఒగా పని చేసిన రవీంద్రరావును ఫారెస్ట్ సెటిల్‌మెంట్ ఆఫీసర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది.

వ్యర్థాల సేకరణలో టెక్నాలజీ వాడండి : కలెక్టర్



ప్రజాశక్తి-విజయవాడ: వ్యర్థాల నిర్వాహణలో విజయవాడలో అగ్రస్థానంలో నిలవాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. విజయవాడను స్వచ్ఛతలో ముందడుగులో ఉంచేందుకు గత ఏడు సంవత్సరాలుగా స్వచ్ఛ సర్వేక్షన్‌లో మొదటి స్థానంలో ఉన్న ఇండోర్ నగరంలో కమిషనర్ ధ్యానచంద్ర అధికారులతో పర్యటించారు. ఇండోర్ నగరంలో అమలు చేస్తున్న వ్యర్థ పదార్థాల నిర్వహణను అధికారులతో పరిశీలించారు. వారు అమలు చేస్తున్న ఇంటి వద్దనే వ్యర్థాలను వేరు చేసే విధానం, వారు వాడుతున్న వ్యర్థ సేకరణ వాహనాలు, వాటికున్న జిపిఎస్ మెకానిజం, చెత్త సేకరణ రూటు మారితే జిపిఎస్‌లో గమనించిన కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సంబంధిత శానిటరీ ఇన్స్పెక్టర్ కి తెలియపరచి వ్యర్థ సేకరణను ఖచ్చితంగా జరిగేటట్టు చూసుకునే విధానం, ఎంఆర్‌ఎఫ్ ప్లాంట్, వ్యర్థ నిర్వహణలో ఉపయోగించే టెక్నాలజీ, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విజయవాడకు తగ్గట్టుగా ఇండోర్ వారు వాడుతున్న టెక్నాలజీ, అమలుపరిచి వ్యర్థ నిర్వహణలో అగ్రస్థానంలో నిలపాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సూపరిండెంటింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, ఇంచార్జ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెహికల్ డిపో ఏసుపాదం పాల్గొన్నారు.

విద్యుత్ భారాలపై పోరుకు సిద్ధం కండి

ఛార్జీ వసూళ్లు చేస్తున్నారని పేర్కొన్నారు. తాజాగా మూడో సర్దుబాటు ఛార్జీ బిల్లులో వేశారని, వచ్చే నెల 4వ సర్దుబాటు ఛార్జీ కలపటానికి రంగం సిద్ధం అయ్యిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నెల బిల్లులలో 10 శాతం నుండి 30 శాతం వరకు బిల్లులు పెరిగాయని, నిరుపేదలపై మరింత భారం పడిందని అన్నారు. అజిత్ సింగ్ నగర్‌లోని లింగం వెంకటలక్ష్మికి మొత్తం రూ.958 బిల్లు రాగా అందులో రూ. 282 (30 శాతం) 2022-23 సర్దుబాటు ఛార్జీ మోపారని వివరించారు. కేంద్రంలోని బిజెపి, గతంలో పాలించిన వైసిపి, నేడు పాలిస్తున్న టిడిపి, జనసేన పార్టీలు వీటికి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఛార్జీలు పెంచబోమని, తగ్గిస్తామని మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం నేడు మాట తప్పిందని, రాష్ట్ర ప్రజలను వంచించిందని విమర్శించారు. గత ప్రభుత్వం చేసిన తప్పులను సరి చేయాల్సిన బాధ్యత కూటమిపై ఉండగా, భారం మోపి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. ఒకవైపున సోలార్ విద్యుత్ ఉత్పత్తి ధరలు యూనిట్ రూ.12 నుండి క్రమంగా రెండు రూపాయలకు తగ్గాయని చెబుతూనే, ఛార్జీలు మాత్రం తగ్గించకుండా పెంచడం తీవ్ర అన్యాయమని మండిపడ్డారు. బడా కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాల వల్లే విద్యుత్ ఛార్జీలు పెరుగుతున్నాయని విమర్శించారు. పెరిగిన విద్యుత్ ఛార్జీలపై ప్రజలు గళం విప్పాలని, కేంద్ర, రాష్ట్ర పాలకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం మాట ఇచ్చినట్లు విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, స్మార్ట్ మీటర్లను ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణరావు, నాయకులు కె.దుర్గారావు, సిహెచ్.శ్రీనివాస్, నిజాముద్దీన్, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు చెల్లించకపోతే హాల్‌టికెట్లు ఇవ్వం

సమయంలో విద్యార్థులను ఇబ్బంది పెట్టొద్దని, ఫీజు రీయింబర్స్ కాలేజీ అకౌంట్లో విడతల వారీగా పాత బకాయిలతో సహా చెల్లిస్తామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పష్టంగా చెప్పినా కళాశాల యాజమాన్యం ఫీజు చెల్లిస్తేనే హాల్‌టికెట్లు ఇస్తామని చెప్పడం తగదన్నారు. ఫీజుల విషయంలో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్న కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ గుడివాడ మండల అధ్యక్షులు నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అర్జీదారుల సమస్యల పరిష్కారానికి కృషి : కలెక్టర్



మీకోసంలో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : తమ సమస్యల పరిష్కారానికి ఎన్నో వ్యయప్రయాసలకు ఓర్చి అధికారుల దష్టికి తీసుకువచ్చిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక సమావేశపు హాలులో ఆయన 'మీకోసం' కార్యక్రమం నిర్వహించి డిఆర్ఓ కే చంద్రశేఖర రావు, కె ఆర్ ఆర్ సి డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి, అదనపు ఎస్పి వివి నాయుడు, బందరు ఆర్డీవో కే స్వాతితో కలిసి వివిధ ప్రాంతాల నుంచి తరలి వచ్చిన ప్రజల వద్ద నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ వచ్చిన అర్జీలను పరిశీలించి జాప్యం చేయకుండా సకాలంలో అర్జీదారునికి నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. డిఆర్ఓ చంద్రశేఖర రావు మాట్లాడుతూ కలెక్టరేట్లోని వివిధ శాఖలకు చెందిన ప్రభుత్వ వాహనాలు ఎంతోకాలంగా నిరుపయోగంగా పడి ఉన్నాయని, ఆ వాహనాలను గుర్తించి, ఫిట్నెస్ రిపోర్టు సమర్పించాలని రవాణా శాఖ అధికారికి సూచించారు. రిపోర్టు ఆధారంగా పనికిరాని వాహనాలకు స్క్రాప్ కోసం బహిరంగ వేలం వేస్తామన్నారు.

ఎస్పి కార్యాలయంలో 42 అర్జీలు స్వీకరణ

'మీకోసం' కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులపై బాధ్యతతో వ్యవహరించి, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడానికి ప్రతి పోలీసు అధికారి కషి చేయాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు సూచించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన మీ కోసం కార్యక్రమంలో పాల్గొని పిర్యాదు దారుల నుండి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదుపై వేగవంతంగా చట్ట పరిధిలో విచారణ జరిపి, తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు అధికా రులకు ఆదేశాలిచ్చామన్నారు. ఫిర్యాదులపై బాధ్యతతో వ్యవహరించి, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడానికి ప్రతి పోలీసు అధికారి కృషి చేయాలని ఆయన తెలిపారు. జిల్లాలోని నలుమూలల నుండి 42 మంది ప్రజలు వివిధ సమస్యల పై పిర్యాదులు అందించినట్లు ఎస్పీ కార్యాలయ అధికారులు తెలిపారు.



సమస్యలు వింటున్న ఎస్పి గంగాధరరావు



అవగాహన కల్పిస్తున్న ఐద్వా కార్యదర్శి రజిని

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం : ఐద్వా

ప్రజాశక్తి - గుడివాడ : మహిళలకు, విద్యార్థులకు రక్షణ కల్పించడంలో ప్రస్తుత ప్రభుత్వం విఫలమైందని ఐద్వా పట్టణ కార్యదర్శి పి రజిని అన్నారు. గుడివాడ శ్రీ చైతన్య జూనియర్ కళాశాలలో ఐద్వా, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా రజిని మాట్లాడుతూ ప్రతి గంటకు చిన్నారులు, విద్యార్థినిలు, మహిళలపై అత్యాచారాలు జరుగుతున్నాయన్నారు. వీటిని ఖండించే విషయంలో అలాగే దోషులను కఠినంగా శిక్షించే విషయంలో ప్రభుత్వ వైఫల్యం కనపడుతుందన్నారు. బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి మగ పిల్లలకి నేర్పించాలని సమానత్వంగా ఉండేటట్లు నేర్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా అధ్యక్షురాలు జిఎన్ఎస్ కుమారి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం, నాగేంద్ర, 80 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఫార్మర్ చాట్ యాప్‌తో పంటల సమాచారం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఫార్మర్ చాట్ యాప్ ద్వారా పంటల సమాచారాన్ని వాతావరణ పరిస్థితులను తెలుసుకొనవచ్చునని డిజిటల్ గ్రీన్ సమస్త ప్రతినిధి కమలాకర్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పులిగడ్డ సచివాలయం వద్ద ఉద్యానవన శాఖ డిజిటల్ గ్రీన్ అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కరుణాకర్ మాట్లాడుతూ రైతులు అన్ని రకాల పంటలకు సంబంధించిన సలహాలను తమ మొబైల్ ఫోన్లో ఫార్మర్ చాట్ అనే దానిలో సమాచారం పొందవచ్చునని, యాప్‌లో పంటల సమాచారంతోపాటు వాతావరణ సమాచారం మార్కెట్ ధరల సమాచారం పొందవచ్చునన్నారు. ఈ ఫార్మర్ చాట్ యాప్‌ని మరింత మంది రైతులు ఉపయోగించుకోవాలని కమలాకర్ సూచించారు. ఉద్యానవన శాఖ అధికారి ఎన్ రమేష్, గ్రామ సర్పంచ్ దాసరి విజయ్ కుమార్, మండల ఉపాధ్యక్షులు పులిగడ్డ పి చ్చే శ్వరరావు, విహెచ్ఓ సౌమ్య, బాలాజీ, శ్రీజ, లక్ష్మి రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : సమస్యలు పరిష్కారించలని కోరుతూ సిపిఎం బంటుమిల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో బంటుమిల్లి తహసీల్దార్ భరత్ రెడ్డికి అర్జీని సోమవారం అందించారు. బంటుమిల్లి ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని, ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం బైపాస్ రోడ్డుని విస్తరణ చేయాలని, జగనన్న కాలనీలో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని, బంటుమిల్లి డ్రైనేజీ సమస్య పరిష్కారం చేయాలని, అలాగే తడిసిన తేమశాతం సంబంధం లేకుండా ధాన్యాలు కొనుగోలు చేసి వెంటనే 48 గంటల్లో దాన్యం డబ్బులు ఇవ్వాలని తదితర డిమాండ్లపై అర్జీల అందించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి మాజేటి శివ శ్రీనివాసరావు, మండల కమిటీ సభ్యులు లంకదాసుల అజయ్ ఘోష్, బొడ్డు నాగరాజు, పొదిలి వెంకన్న, ఎంట్రపాటి శ్యాము, సిపిఎం సీనియర్ నాయకులు గౌరిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

వంతెన నిర్మించాలని వినతి : అలాగే పెద్దతుమ్మిడి నుంచి గుడివాడ వెళ్లే మార్గంలో డ్రైనేజీ పై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరిందని కొత్త వంతెన నిరించాలని కోరుతూ పెద్ద తుమ్మడి గ్రామానికి చెందిన మొరాల వెంకటేశ్వరావు వినతిపత్రం అందించారు. బ్రిటిష్‌కాలంలో నిర్మించిన ఈ వంతెన శిథిలావస్థకు చేరి గుంతలు పడి రాకపోకలకు ఇబ్బంది కలుగుతోందని వివరించారు.



అర్జీ అందిస్తున్న నాయకులు

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం పురస్కరించుకుని ఆకునూరులో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీవో జీఎస్వీ శేషగిరిరావు ఈసందర్భంగా మాట్లాడుతూ 2030 నాటికి ప్రపంచంలో హెచ్ఐవీ పూర్తిగా నిర్మూలించే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. రాష్ట్రంలో హెచ్ఐవీ వైరస్ భారిన పడేవారిలో యువత ఎక్కువగా ఉండటం బాధాకరమన్నారు. ఎయిడ్స్ మహమ్మారిపై ప్రతిఒక్కరిలో అవగాహన కల్పించాల్సిన అవసరాన్ని పీహెచ్ వైద్యు రాలు జ్యోత్స్న వివరించారు. ఆకునూరు పాఠశాల విద్యా ర్థులు, ఎంఎల్ పిలు, సూపర్వైజర్లు ర్యాలీలో తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలని ధర్నా



వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - గుడివాడ : రైతుల ధాన్యాన్ని 48 గంటల్లోగా తేమ శాతం నిబంధనలు సడలించి రూ.1730లకు కొనుగోలు చెయ్యాలని, సి2ప్లస్50 చట్టం చెయ్యాలని, 100 కేజీల ధాన్యానికి రూ.3000లు గిట్టుబాటు ధర చట్టం చేయాలని, కౌలు రైతు చట్టం ముసాయిదాలో యజమాని సంతకం నిబంధన తీసేసి 33 లక్షల కౌలు రైతులందరికీ కార్డులు మంజూరు చేయాలని కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు డిమాండ్ చేశారు. సోమవారం రైతు కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆర్.డి.ఓ ఆఫీసు వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఎఒకు వినతి పత్రం అందచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మార్ట్ మీటరులు బిగించటం వెంటనే ఆపాలన్నారు. రైతు సంఘం నాయకులు ఎన్. మురళీకష్ణారెడ్డి మాట్లాడుతూ సి 2 ప్లస్ 50 చట్టం చేసే వరకు పోరాటం ఆగదన్నారు. డిజిటలైజెషన్ పేరుతో మళ్ళీ రైతుల భూములను కార్పొరేట్‌కి కట్టబెట్టేందుకు కుట్ర జరుగుతోందని దీనిని తిప్పి కొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బి.వి.శ్రీనివరరావు, రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్.ఉమా మహేశ్వరరావు, పెదపారుపుడి, నందివాడ, గుడివాడ రూరల్ గుడ్లవల్లేరు మండలాల్లోలోని 10 గ్రామాల రైతులు కౌలు రైతులు

జూదరుల అరెస్టు

ప్రజాశక్తి-గన్నవరం : మండలంలోని కొండపావులూరు సమీపంలోని ఎన్‌డిఆర్ఎఫ్ ప్రాంత పరిధిలో గుట్టుచప్పుడు కాకుండా పేకాడుతున్న ఆరుగురు వ్యక్తులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం పేకాడుతున్నట్లు సీఐ శివ ప్రసాద్‌కు సమాచారం రావడంతో సిబ్బందిని పంపించారు. పేకాడుతున్న అరుగురిని పట్టుకొని వారి వద్ద నుంచి రూ.5460 స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అలాగే జక్కులనెక్కలం ఏలూరు కాలువ కట్టపై కోడి పందేలు వేస్తున్న 9 మందిని వారి వద్ద నుంచి రూ.10,700 నగదు, ఏడు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు.



గుడ్ అండ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : స్థానిక శ్రీ సాయి విద్యానికేతన్ పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులకు పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో బాల్యవివాహాలు, గుడ్ టచ్, బాడ్ టచ్, ట్రాఫిక్ రూల్స్, సైబర్ నేరాలు గురించి అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సింగంశెట్టి ఆదినారాయణ మాట్లాడుతూ అపరచితులు ఎవరైనా చాకలేట్లు, బిస్కట్లు తీసుకోరాదని వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీసులు జి అరుణ, బి అలివేలు మంగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీ

ప్రజాశక్తి.. హనుమాన్ జంక్షన్(గన్నవరం) : బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్ నాలుగు రోడ్ల కూడలిలో సోమవారం వాహనాలు తనిఖీలు హనుమాన్ జంక్షన్ ఎస్సై సురేష్ నిర్వహించారు. సరైన పత్రాలు, డ్రైవింగ్ లైసెన్స్ లేని వాహనాలకు జరిమానా విధించారు. యువకులు వాహనాలను వేగంగా తోలిన, పత్రాలు లేకపోయినా జరిమానాలు వేస్తామని చెప్పారు. కొన్ని వాహనాలను సీజ్ చేస్తామని వివరించారు.

సిపిఆర్‌పై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-అవనిగడ్డ : హఠాత్తుగా గుండె నొప్పి వచ్చిన వారికి సిపిఆర్ చేయడం ద్వారా బతికించవచ్చునని డాక్టర్ వంకర శేషగిరిరావు తెలిపారు. సోమవారం బాలుర గురుకుల పాఠశాలలో ఆరోగ్య భారతి అఖిల భారత స్వచ్ఛంద సంస్థ ధన్వంతరి జయంతి వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు ఉపాధ్యాయులకు సిపిఆర్‌పై శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న శేషగిరిరావు మాట్లాడుతూ గుండె నొప్పి వచ్చినప్పుడు ఎంతో నిస్సత్తుగా చిరాకుగా ఉంటుందని, ఆకస్మాత్తుగా గుండెలో ఏదో గట్టిగా పట్టేసినట్లు తీవ్రంగా నొప్పి మొదలవుతుందని ఆ నొప్పి భుజాల వరకు ఇంకా పైకి దవడల వైపు కూడా వస్తుందన్నారు. ఆ కారణంగా మనిషి మృతి చెందుతాడని తెలిపారు. అలాంటి సమయంలో వెంటనే సిపిఆర్ చేయడం ద్వారా బతికించవచ్చునని, ఈ అవగాహన ప్రతి ఒక్కరిలో ఉండాలని తెలిపారు. ఈ సందర్భంగా కొంతమంది విద్యార్థుల చేత స్వయంగా ప్రాక్టీస్ చేయించారు. పాఠశాలకు చెందిన 467 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొనగా ఆరోగ్య భారతి కష్ణాజిల్లా కార్యదర్శి గుడిసేవ విష్ణు ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్ టి పి కుమార్, ఉపాధ్యాయులు శ్రీకాంత్ పాల్గొన్నారు.





నిమ్రా కాలేజీలో డాక్టర్ రాజ్‌కుమార్ సంస్మరణ కార్యక్రమం

రాజ్‌కుమార్ సంస్మరణ కార్యక్రమం

ప్రజాశక్తి - భవానీపురం : ఇటీవల మృతి చెందిన డాక్టర్ ఆకుల రాజ్ కుమార్ సంస్మరణ కార్యక్రమం నిమ్రా మెడికల్ కాలేజీలో జరిగింది. నిమ్రా మెడికల్ కళాశాల మేనేజ్మెంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రొఫెసర్లు, డాక్టర్ రాజకుమార్ సహచర పీజీ విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వక్తలు డాక్టర్ రాజ్ కుమార్ చేసిన సామాజిక సేవలను గుర్తుకు తెచ్చుకున్నారు. పేద రోగుల పట్ల డాక్టర్ రాజ్ కుమార్ ఎంతో సానుభూతితో వ్యవహరించే వారని కొనియాడారు. ఇటీవల బుడమేరు వరదలు సమయంలోను, గతంలో కరోనా సమయంలోను చేసిన సేవా కార్యక్రమాలను స్మరించుకున్నారు. డాక్టర్ రాజ్ కుమార్ అకాల మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని సమావేశంలో తెలియజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - వన్‌టౌన్ : శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రి దుర్గమ్మను కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుమిత్ర దర్శించు కున్నారు. తెలంగాణ స్పెషల్ చీఫ్ సెక్రటరీ (హోం) రవి గుప్తా, చిత్ర దర్శకులు జ్యోతి కృష్ణ, దుర్గమ్మను దర్శించుకున్నారు. వీరికి ఆలయాధికారులు స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం ఆలయ వేదపండితులు వీరికి వేదార్వచనం చేసి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.



రవిగుప్తాకు చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు



నందిగామ ఆర్‌డిఒ బాలకృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

పెండింగ్ వేతనాలు చెల్లించాలి: సిఐటియు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్స్కు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో నందిగామ ఆర్‌డిఒ కె.బాలకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి కె. గోపాల్ మాట్లాడుతూ నందిగామ మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో శానిటేషన్ వర్కర్స్ అనేక మంది పనిచేస్తున్నారని తెలిపారు. పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లను శుభ్రం చేస్తూ ప్రాంగణంలో పారిశుధ్య పనులు నిర్వహిస్తూ విద్యార్థులు అనారోగ్యం పాలుకాకుండా కాపాడటంలో ముఖ్య పాత్ర వహిస్తున్నారని తెలిపారు. బకాయి ఉన్న 5 నెలల వేతనాలు వెంటనే ఇప్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు కర్రీ వెంకటేశ్వరరావు, శానిటేషన్ వర్కర్స్ బెల్లంకొండ లక్ష్మి, మై ముని, వరలక్ష్మి, సుశీల, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

బాదంతో రోగనిరోధక శక్తి బలోపేతం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : కాలానుగుణ మార్పుల నేపథ్యంలో రోగనిరోధక శక్తిని ప్రభావవంతంగా మెరుగుపరుచుకోవటానికి బాదం ఎంతో ఉపయోగకారిగా ఉంటుందని పోషకాహార నిపుణులు రితికా అన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ దినచర్యలో పోషకాలు అధికంగా ఉండే ఆహారాలను చేర్చుకోవాలన్నారు. సూపర్‌ఫుడ్‌లలో ఒకటి కాలిఫోర్నియా బాదం అని వైవిధ్యమైనప్పటికీ, సంపూర్ణమైన ఆహారంగా బాదం పోషకాహారం పవర్‌హౌస్‌గా నిలుస్తుందన్నారు. కాలిఫోర్నియా బాదంలో ప్రోటీన్, ఫైబర్, ఆరోగ్యకరమైన కొవ్వులు వంటి 15 ముఖ్యమైన పోషకాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు

ప్రత్యేక డ్యూటీల అలవెన్సులు ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాశక్తి - విజయవాడ : ఈ నెల 21 నుంచి భవానీ దీక్షలకు డ్యూటీలు కేటాయించిన వారికి, గతంలో దసరా డ్యూటీలు చేసిన ఆశ వర్కర్లకు, ప్రత్యేక అలవెన్స్, టిఎ, డిఎలు ఇవ్వాలని ఎపి ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల కోరారు. ఈ మేరకు సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశను యూనియన్ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ విజయవాడ నగరంలో డిసెంబర్ 21 నుండి భవానీ దీక్షా విరమణలు జరుగుతున్నాయని, దానిలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా వచ్చే భవానీలకు, ఆరోగ్యపరమైన సేవలందించేందుకు, ఆశ వర్కర్లకు విధులు కేటాయించారన్నారు. విజయవాడ నగరంలో వారు నివసించే ప్రాంతం నుండి, కనకదుర్గమ్మ దేవస్థానానికి రావడానికి వందల రూపాయలు ఖర్చు అవుతున్నాయని, కానీ వారికి ఏ డిపార్ట్మెంట్ నుండి ప్రయాణపు ఖర్చులు ఇవ్వడం లేదని, దీనివలన ఆశ వర్కర్ల పై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. తాము దుర్గగుడి ఈవోకు లేఖరాసినా స్పందించడం లేదన్నారు. ప్రతీ సంవత్సరం, ఆశా వర్కర్లు మూడు షిఫ్టుల్లో 15 రోజులు పాటు డ్యూటీలు చేశారన్నారు. ఇప్పటివరకు ఏ సంవత్సరం కూడా వారికి ప్రయాణపు ఖర్చులు చెల్లించలేదన్నారు. ప్రత్యేక అలవెన్స్ , టి.ఏ డి.ఏలు, చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చెల్లించని పక్షంలో, వారిని భవానీ దీక్షలు విరమణ డ్యూటీల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కలెక్టర్ స్పందిస్తూ తప్పకుండా ఈ విషయంపై సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి పి.శ్రీలక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షులు టి.హవేలీ కుమారి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మహిళలపై హింస అరికట్టడం సామాజిక బాధ్యత

విజయవాడ : మూఢనమ్మకాలు సాంప్రదాయాల పేరిట మహిళలను బాధ పెట్టడం సరికాదని సేఫ్ కమిటీ నిర్వాహకులు కె.స్వరూప రాణి అన్నారు. అంతర్జాతీయంగా మహిళలపై హింసకు వ్యతిరేకంగా పాటిస్తున్న కార్యక్రమాలలో భాగంగా సోమవారం కానూరులోని సిద్ధార్థ బిఇడి కళాశాలలో సేఫ్ నగర కమిటా ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సేఫ్ అధ్యక్షురాలు జి జోత్స్న అకాల మృతికి సదస్సు నివాళులర్పించించారు. స్వరూప రాణి మాట్లాడుతూ సమాజంలో సగ భాగంగా ఉన్న మహిళలు అన్నింటా భాగస్వామ్యం అయినప్పుడే సమాజ పురోగతి ఉంటుందని అన్నారు. సతీ సహగమనం బాల్యవివాహాల పేరిట జరిగిన దురాచారాలపై సాగిన సంస్కరణోద్యమం స్త్రీల పరిస్థితులలో మార్పు తెచ్చిందని చెప్పారు. అనేక రంగాలలో స్త్రీ పురోగమిస్తున్నా ఆమెపై వేధింపులు హింస ఆయా రంగాల్లో సైతం ఎదుర్కొంటున్నారని చెప్పారు. ఈ పరిస్థితి మారాలంటే స్త్రీ పై హింసను సహించం అని యునెస్కో తీసుకున్న నినాదం ఆచరణ లోకి రావాలన్నారు. వక్తలు మాట్లాడుతూ మహిళలపై హింస వేధింపులు జరగకుండా చూడడం సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ఇంటి నుండి మొదలుకొని విద్యాలయాలు, కార్యాలయాలు, మహిళల భాగస్వామ్యం అన్ని ప్రాంతాలలో అవగాహన పెరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శేషాద్రి, లెక్చరర్ కృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్ సుజిత్ సేఫ్ సభ్యురాలు డి.జ్యోతి ఎంబివికె సభ్యులు పావని, గీత పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న స్వరూపరాణి, తదితరులు

జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కొండపల్లి పట్టణ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జాతీయ కాలుష్య నివారణ దినోత్సవం సందర్భంగా కొండపల్లి జిల్లా పరిషత్ బాలుర హై స్కూల్లో సభ నిర్వహించారు. హైస్కూల్ హెచ్ఎం ఎంవి.శేషగిరిరావు సభకు అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ మోహన్‌రావు మెమోరియల్ హాస్పిటల్ డాక్టర్ మామిడి సీతారామారావు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం ముఖ్యంగా ఆరు రకాలుగా ఉన్నాయన్నారు. వాయు, నీరు, భౌమ, ఆహార, ధ్వని, కాంతి కాలుష్యాలుగా ఉన్నాయన్నారు. నీరు మనకు సహజ వనరు మానవులకు జంతువులకు మొక్కలకు మాత్రమే కాకుండా వ్యవసాయానికి పరిశ్రమలకు కరెంటు ఉత్పత్తికి ఉపయోగ పడుతుందని తెలిపారు ఈ నీరు కలుషితమైతే క్యాన్సర్ గుండె జబ్బులు చర్మ వధులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గాలి కాలుష్యాన్ని నీటి కాలుష్యాన్ని అరికట్టాలన్నారు. పరిశ్రమల చుట్టుపక్కల గ్రామాల ప్రజలకు వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు మాట్లాడుతూ 21వ శతాబ్దంలో మనకున్న సమస్యల్లో పర్యావరణ సమస్యలే ప్రథమ స్థానంలో ఉన్నాయన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల ఫలితాలను ఉపయోగించుకోవడంలో శాస్త్రీయ దక్పథం లేకపోవడమే దీనికి కారణం అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజల భాగస్వామ్యంతో తక్షణమే నివారణ చర్యలు అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జె.వి.వి.కొండపల్లి పట్టణ శాఖ కార్యదర్శి ఎస్‌కె.సర్దార్ సాహెబ్, ఉపాధ్యాయులు కె.అశోక్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ సీతారామారావు

నూతన సినిమా షూటింగ్ ప్రారంభం

ప్రజాశక్తి - విస్సన్నపేట : విస్సన్నపేట మండలం కలగర గ్రామంలో శ్రీ రత్నమ్స్ ఫిలిం క్రియేషన్ ప్రొడక్షన్-2 వందేమాతరం సినిమాకు క్లాప్ కొట్టి సినిమాను తిరువూరు ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వందేమాతరం సినిమాకు కావాల్సిన సహాయ సహకారాలు ప్రభుత్వం తరపున నేను అందిస్తాననీ తిరువూరు నియోజకవర్గంలో ప్రకృతి కొండలు గుట్టలు, పచ్చని చెట్లు చాలా ఆహ్లాదకరంగా ఉంటాయనీ ఊటి లోనో అరకులో, ఉన్నామా అన్న అనుభూతి కలుగుతుందనీ తిరువూరు నియోజకవర్గం నుంచి సినిమా తీయడం శుభపరిణామం అని తెలిపారు. అనంతరం డైరెక్టర్ బివి.రత్నం మాట్లాడుతూ సినిమా పూర్తయిన తర్వాత ఓటిటిలో విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత జంగం కిరణ్‌బాబు, మ్యూజిక్ డైరెక్టర్ ఎస్ రాజ్ కిరణ్, కెమెరా ఎడిటింగ్, బిఎన్.బాబు, సహాయ నిర్మాత శాంతభూషణం, ఎడిటింగ్ మేడేపల్లి ఇస్సాకు తదితరులు పాల్గొన్నారు.



సినిమా షూటింగ్‌కు క్లాప్ కొడుతున్న ఎంఎల్‌ఎ కొలికపూడి

కేతనకొండ గ్రామ నీటి సంఘం అధ్యక్షుడిగా ముత్తర్ మియా

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : కేతనకొండ గ్రామ నీటి సంఘం అధ్యక్షుడిగా సయ్యద్ ముత్తర్ మియా ఎన్నికయ్యారు. ఆదివారం రాత్రి జరిగిన టిడిపి సమావేశంలో ముత్తర్ మియాను అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా పగడాల శ్రీనివాసరావు ఎన్నికయ్యారు. టిడిపి సీనియర్ నాయకులు లేపాక్షిరావు మాట్లాడుతూ స్థానిక ఎంఎల్‌ఎ వసంత కృష్ణ ప్రసాద్ సూచన మేరకు నీటి సంఘం నియామకం చేసినట్లు, గ్రామంలోని రైతులు. వ్యవసాయ రంగానికి చేయూత ఇచ్చేందుకు తమవంతు కృషి చేయాలని నూతన సభ్యులను కోరారు. ఈ సమావేశంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు గోపి, నాయకులు చలపతి, వలి, వెంకట్రావు పత్రి హరి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌టిసి డిపో సమస్యలపై వినతి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట: విజయవాడ ఆర్టీసీ చైర్మన్ కార్యాలయంలో జగ్గయ్యపేట ఆర్టీసీ డిపో సమస్యలపై ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ళ నారాయణరావును సోమవారం జగ్గయ్య పేట ఎంఎల్‌ఎ, పిఎసి సభ్యులు టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరామ్ రాజగోపాల్ తాతయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కొత్త బస్సు సర్వీసులు ఏర్పాటు చేయాలని, బస్టాండ్‌లోను డిపోలోను ప్రజలకు ఆర్టీసీ ద్వారా మెరుగైన సేవలం దించాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గింజుపల్లి రమేష్, కళ్యాణం కృష్ణారావు, కళ్యాణం మురళి, కాసరగడ్డ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించాలి

ప్రజాశక్తి - వత్సవాయి : ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని వత్సవాయి ఎస్ఐ ఉమామహేశ్వరరావు అన్నారు. మండల కేంద్రమైన వత్సవాయిలో వాహనాల తనిఖీల్లో భాగంగా హెల్మెట్ లేని వారిని హెల్మెట్లు ధరించాలని హెచ్చరించారు. హెల్మెట్ ధరించకపోతే ప్రమాదాలు జరిగి బలమైన గాయాలు కావడంతో ఆ వ్యక్తి జీవితంలో కోలుకోలేడని వారి కుటుంబం రోడ్డున పడుతుందని అన్నారు. హెల్మెట్ ధరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

ట్రాఫిక్‌పై అవగాహన ఉండాలి : ట్రాఫిక్ సిఐ సతీష్

ప్రజాశక్తి - నందిగామ : ట్రాఫిక్‌పై అవగాహన ఉండాలని నందిగామ ట్రాఫిక్ సీఐ సతీష్ పేర్కొన్నారు. ట్రాఫిక్ ఎడిసిపి ప్రసన్నకుమార్ ఎసిపి తిలక్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిఐ సతీష్ ట్రాఫిక్‌పై, హెల్మెట్ ధరించటం వల్ల కలిగే ప్రయోజనాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. నందిగామ పట్టణంలో చందాపురం రోడ్డులో ట్రాఫిక్ సిఐ సతీష్ అవగాహన సదస్సు నిర్వహించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని హెల్మెట్ ధరించడం ఏదైనా ప్రమాదం రిగిన ప్రాణా హాని ఉండదని తీవ్ర గాయాల నుండి తప్పించుకోవచ్చని ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ ధరించడం వల్ల మన ప్రాణాలను కాపాడుకోవచ్చని ట్రాఫిక్ సిఐ అన్నారు. ద్విచక్ర వాహనదారులకు ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ పై పలు సూచనలు చేశారు. తల్లిదండ్రులు కూడా మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కూడా చర్యలు తీసుకుంటామని మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ అన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై నరేష్ సిబ్బంది పాల్గొన్నారు.





కూడూరులో మూడు రోజులుగా నీటిలో మగ్గుతున్న వరి, మినుము



చేవెంద్రలో నేలకొరిగిన వరిపంట

రైతుల కష్టం నీళ్లపాలు

- అకాల వర్షాలతో పాడైన వరి, మినుము పంటలు
- వరుస నష్టాలతో రైతుల తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-పెడన : పెడన నియోజకవర్గం లోని పెడన, గూడూరు, బంటుమిల్లి, కత్తివెన్ను మండలాల్లో గత నాలుగు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలు కారణంగా దాదాపు పదివేల ఎకరాల పైగా వరి పంట పూర్తిగా పాడైపోయింది. మండల పరిధిలోని కమలాపురం, చెన్నూరు, కొపల్లి, నేలకొండపల్లి, పుల్లపాడు గ్రామాలతో పాటు గూడూరు మండలంలోని ఆకుల మన్నాడు, మల్లవోలు, పోలవరం , గూడూరు, ఆకుమర్లకు, రామరాజుపాలెం బంటుమిల్లి మండలంలోని ముంజు లూరు, సాతులూరు, అత్తమూరు గ్రామాలతో పాటు పలు గ్రామాల్లో వర్షబావ పరిస్థితుల వల్ల దాదాపు పదివేల ఎకరాలలో వరి పంట పూర్తిగా పాడైపోయింది. అంతేకాకుండా 3000 ఎకరాల్లో ఆరుతడి పంట అయిన మినుము కూడా మూడు రోజులుగా నీళ్లలోని మగ్గుతుంది. దీనివలన తల్లి వేరు కుళ్ళిపోయి మొక్క చనిపోయే ప్రమాదం ఉంది.గతేడాది ఇదే నెలలో జరిగిన మిచాంగు, గత నాలుగు నెలల క్రితం జరిగిన అకాల వర్షాలతో రైతులు నిండా మునిగిపోయారు. వాటి నష్టపరిహారం నేటికి అందలేదు. మరో మరో ఇలా తుఫాన్ కారణంగా ఆరుతడి పంటలైన మినుము, వేరుశనగ, పెసర వంటి పంటలు పాడైపోవడంతో బోరున విలపిస్తున్నారు.

గుడ్లవల్లేరు మండలంలో మొలకెత్తిన ధాన్యం



మొలకెత్తిన వరిధాన్యం

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : తుఫాన్ ప్రభావంతో మండలంలోని వడ్లమన్నాడు గ్రామంలో 12 వేల ఎకరాలు వరి పంట నేలకొరిగి రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆరు కాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చే సమయానికి తుఫాన్ ప్రభావంతో పండించిన పంట పూర్తిగా నేలకొరిగి నీటిపాలయ్యాయి. మండలంలో అధిక శాతం వడ్లమన్నాడు పంచాయతీ పరిధిలో వరి పంట12 వేల ఎకరాలు నేలకొరిగి ధాన్యం మొలకెత్తాయి. అలాగే కొన్ని గ్రామాల్లో 3వేల ఎకరాలు నేలకొరికి నీట మునిగి నష్టపోయినట్లు రైతులు చెప్తున్నారు. దీనిపై ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని రైతాంగం కోరుతున్నారు.



బకాయిలు చెల్లించాలని వంటావార్పు

ప్రజాశక్తి-గన్నవరం : : తమకు రావాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని బాధిత మేస్త్రీలు రామ్మోహనరావు, సతీష్ డిమాండ్ చేశారు. గన్నవరం అయోధ్య అపార్టుమెంట్స్‌లో తాపీ పనులు చేసిన కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలు ఇవ్వటం లేదంటూ చేస్తున్న రిలే దీక్షలు సోమవారం కూడా కొనసాగాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేస్త్రీలకు బాకాయిలు రామ్మోహనరావుకు రూ.1.56 కోట్లు, బాబుకు రూ.56 లక్షలు, సతీష్ కు రూ.99లక్షలు, దాస్ కు రూ.1.40కోట్లు, తేజకు రూ.14లక్షలు, వెంకన్నకు రూ.84లక్షలు ఇవ్వాలని తెలిపారు. అదేమని అడిగితే తప్పుడు లెక్కలు చూపిస్తున్నారని వాపోయారు. ప్రాజెక్టు చీఫ్ ఇంజనీర్ నారాయణ ప్రసాద్, సైట్ ఇంజనీర్ సాయి సుందర్లతో తప్పుడు లెక్కలు చేయించి వాటిని చూపుతున్నారని తెలిపారు. తమ కింద 1200 మంది కూలీలు పని చేశారని కొంత మందికి తాము కూడా బకాయిలు పడ్డామని చెప్పారు. వారు ఇళ్లకు వస్తుంటే దిక్కుతోచని పరిస్థితిలో కుటుంబ సభ్యులతో కలసి రోడ్డెక్కాల్సి వచ్చిందని కూటమి ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు. బాబు, హసీనా నాగూర్ భాషా, దాస్, లక్ష్మీ ప్రసన్న, కళ్యాణ్, వెం కన్న, తేజ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగాలకు గుడ్లవల్లేరు పాలిటెక్నిక్ విద్యార్థులు ఎంపిక









ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : బహుళ జాతీయ సంస్థ థాట్ వర్క్స్ టెక్నాలజీస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ వారు గుడ్లవల్లేరు ఎ.ఎ.ఎన్.ఎమ్ అండ్ వి.వి.ఆర్.ఎస్. ఆర్. పాలిటెక్నిక్ లో సుమారు 400 మంది విద్యార్థులకు ప్రాంగణ ఎంపికలు నిర్వహించగా వారిలో నలుగురు కంప్యూటర్ విద్యార్థులు వార్షిక ఆదాయం ఎనిమిది లక్షల వేతనంతో ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందని ప్రిన్సిపాల్ ఎన్.రాజశేఖర్ పేర్కొన్నారు. జి.మోహంతి, జి.రష్మిక, జి.జ్యోతి ప్రవీణ్ మరియు జి.చిరంజీవి లు వివిధ అంశాలలో పోటీపడి ఉద్యోగాలు సాధించారన్నారు. ఈ సందర్భంగా ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ ఎమ్.వినయ్‌ని, ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను, కంప్యూటర్ విభాగాధిపతి ఎ.కష్ణ చైతన్యలను యాజమాన్య సభ్యులు చైర్మన్ డాక్టర్ నాగేశ్వరావు వల్లూరిపల్లి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సత్యనారాయణ రావు వల్లూరుపల్లి, కో-సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ వల్లూరిపల్లి రామకష్ణ, ఎగ్జిక్యూటివ్ మెంటార్ .రామాంజనేయులు అభినందించారు.

డిజిటల్ అక్షరాస్యతతోనే ఉద్యోగావకాశాలు

- ఎజి అండ్ ఎస్‌జి ఎస్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శివనాథ్

ప్రజాశక్తి-ఉయ్యూరు : ప్రతిఒక్కరూ డిజిటల్‌గా అక్షరాస్యులైతేనే జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించటంతో పాటుగా భవిష్యత్తులో మంచి ఉద్యోగ అవకాశాలను అందుకోగలరని అడుసుమిల్లి గోపాలకష్ణయ్య, చెరకు రైతుల సిద్ధార్థ కళాశాల (ఎజి అండ్ ఎస్‌జిఎస్ డిగ్రీ కళాశాల-విజయవాడ సిద్ధార్థ అకాడమీ అనుబంధం) ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.శివనాథ్ అన్నారు. పపంచ కంప్యూటర్ అక్షరాస్యత దినోత్సవం సందర్భంగా సోమవారం ఏర్పాటుచేసిన కంప్యూటర్ పరికరాల ప్రదర్శనను ఆయనతోపాటుగా ప్రత్యేకాధికారి కె.సత్యనారాయణ ప్రారంభించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సి.హెచ్. అనిల్ కుమార్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు పర్యవేక్షించారు. వివిధ కంప్యూటర్ సైన్స్ అంశాల నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇ-క్లాస్ రూమ్‌లో కంప్యూటర్ అక్షరాస్యతపై క్విజ్ నిర్వహించారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సి.హెచ్. అనిల్ కుమార్, అధ్యాపకులు ఎస్.ప్రభావతి, ఎ ఎన్ .శ్రీనివాసరావు, జి.కాత్యాయని, ఒ.తేజశ్రీ, ఎండి షర్మిలబేగం, జి.మహేష్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శివనాథ్, సత్యనారాయణ మాట్లాడుతూ ఇప్పుడంతా డిజిటల్ యుగం నడుస్తోందన్నారు. డిజిటల్‌గా అభివద్ధి చెంది ఎఐ, ఎంఎల్ వంటివి నేర్చుకుంటేనే భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు అందుకోగలమని వివరించారు. లేనిపక్షంలో వెనుకబడిపోతారన్నారు. డిజిటల్ లిటరసీని అలవర్చుకుంటేనే ఇంటర్నెట్‌ను భద్రంగా ఉపయోగించుకోగలమన్నారు. సామాజిక మాధ్యమాలు వేరనీ, సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లను ఉపయోగించటం వేరు అని గుర్తుచేశారు. అందువల్ల నేటి యువతకు డిజిటల్ లిటరసీ అనేది జీవితంలో ఉపాధికి ఎంతో అవసరమని గుర్తుచేశారు. కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి సి.హెచ్. అనిల్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగాలు, వీసా, పాస్‌పోర్టు, బ్యాంకు, పోస్టాఫీసు, ప్రయాణాలు ఇలా అన్ని అవసరాలు ఆన్‌లైన్‌లోనే అందుబాటులోకి వచ్చాయన్నారు. అందువల్ల కంప్యూటర్ నాలెడ్జ్ ఉండటంతోపాటుగా డిజిటల్ పరిజ్ఞానం ఎంతైనా అవసరమని, తమ ప్రాజెక్టుల ద్వారా విద్యార్థులు గుర్తుచేశారన్నారు.







వినతిపత్రం అందిస్తున్న ఎం. హరిబాబు

ధాన్యం రైతులను ఆదుకోవాలని వినతి

ప్రజాశక్తి-కంకిపాడు : రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను ప్రభుత్వం కొని రైతులను ఆదుకోవాలని కౌలు రైతుసంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కంకిపాడు మండంలోని పలు గ్రామాల్లో ఆయన పర్యటించి ధాన్యం రాశులను పరిశీలించారు. అనంతరం రైతులను ఆదుకోవాలని కోరుతూ కంకిపాడు తహశీల్దార్ భావనారాయణకు సోమవారం ఆయన వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణం కారణంగా ఆందోళనలో ఉన్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ముఖ్యంగా ఈ సీజన్లో 1262 ధాన్యపు రకాన్ని మిలర్స్ కొనుగోలు చేయటనికి అభ్యంతరం చెబుతున్నారని, దీంతో రైతులు ఆందోళన పడుతున్నారన్నారు. ఈ విషయంపై అధికారులు చొరవ తీసుకొని విత్తన రకంతో సంబంధం లేకుండా కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుని రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కంకిపాడు మండల కార్యదర్శి నరేష్, కౌలు రైతు సంఘం మండల కార్యదర్శి మరియాదాసు, నాయకులు రాజా తదితరులు పాల్గొన్నారు.

వెబ్ డెవలప్‌మెంట్ కోర్సుపై ఉచిత శిక్షణ

ప్రజాశక్తి - గుడివాడ : ప్రముఖ కేబిఆర్ గవర్న మెంట్ ఐటిఐ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివద్ధి సంస్థ ద్వారా నిర్వహిస్తున్న స్కిల్ హబ్‌లో వెబ్ డెవలపర్ కోర్సును ఉచితంగా అందిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాధికారి డా॥ పి.నరేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్స్‌లో జాయిన్ అవ్వాలి అనుకునేవారు ఇంటర్మీడియట్ పూర్తిచేసి ఉండాల న్నారు. ఈ అవకాశాన్ని గుడివాడ నియోజకవర్గ ప్రజలు ఉపయోగించుకోవాలని ఐటిఐ ప్రిన్సిపాల్/ కన్వీనర్ ఎల్. గౌరీ మణి తెలిపారు. వివరాల కోసం ఫోన్ 9848819682, 9666654641 నెంబర్లను సంప్రదించవచ్చన్నారు.



మహాసభల కరపత్రాలు పంపిణీ చేస్తున్న నాయకులు

కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి-చల్లపల్లి : భారత కమ్యూనిస్టు పార్టీ జిల్లా మహాసభలు జయప్రదం చేయాలని సిపిఎం కార్యకర్తలు పిలుపునిచ్చారు. చల్లపల్లిలో జరిగే జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని కార్యకర్తలు విస్తతంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చల్లపల్లి మండల పరిధిలోని నారాయణరావునగర్‌లో సోమవారం కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి యుద్ధంపూడి మధు మాట్లాడుతూ 33 సంవత్సరాల తర్వాత ఈ నెల 15, 16, 17 తేదీలలో చల్లపల్లిలో జరిగే జిల్లా మహాసభలకు సహకారం అందించాలని కోరారు. చల్లపల్లి నారాయణరావు పేరుతో ఏర్పడ్డ నారాయణ రావు నగర్ కాలనీలో 2400 మందికి నివే స్థలాలు పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీకి దక్కిందని వివరించారు. కమ్యూనిస్టులు పోరాట ఫలితంగా చల్లపల్లి జమిందార్ మిగుల భూముల పంపిణీ జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మహమ్మద్ కరీముల్లా, బళ్లా వెంకటేశ్వరరావు, కుంపటి బాబురావు,మేడేపల్లి వెంకటేశ్వరరావు, లంకపల్లి సత్యనారాయణ, పార్టీ కార్యకర్తలు నంద్యాల ప్రభు, కలపాల దానయ్య,దేవు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

పోరాటాలతోనే ప్రభుత్వాలకు కనువిప్పు : డి.వి.కృష్ణ

ప్రజాశక్తి - ఎ.కొండూరు : ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు కనువిప్పు కలగాలంటే నిత్యం ప్రజా సమస్యలపై పోరాడే సిపిఎం నిరసనలు, ఆందోళన కార్యక్రమాలు, పోరాటాలు ఉధృతం చేయవలసిన సమయం వచ్చిందని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ అన్నారు. సోమవారం ఎ.కొండూరు అడ్డరోడ్డు సమీపానగల మ్యాంగో మార్కెట్లో సిపిఎం ఎనిమిదవ మహాసభ సిపిఎం నాయకులు పానేం ఆనందరావు అధ్యక్షతన జరిగింది. ఈ సభలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు చేసిన వాగ్దానాలను మరచి ప్రజలపై అనేక రకాలుగా భారాలను మోపుతున్నారని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు కరెంటు ఛార్జీలు పెంచబోమని, స్మార్ట్ మీటర్లు పెట్టబోమని వాగ్దానం చేసి ట్రూ అప్ ఛార్జీల పేరుతో ప్రజల పై 17 వేల కోట్ల రూపాయలు భారాన్ని వేసిందని విమర్శించారు. అంతకుముందు సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.రామకృష్ణారెడ్డి జెండా ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కోట కళ్యాణ్, మేకల నాగేంద్ర ప్రసాద్, నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు


మాట్లాడుతున్న డివి.కృష్ణ

నూతన కార్యవర్గం

సిపిఎం మండల కార్యదర్శిగా పానేం ఆనందరావు, కమిటీ సభ్యులుగా జెట్టి వెంకటేశ్వరరావు, ఆళ్ల అమ్మిరెడ్డి, వెంకటేశ్వరరావు, రావూరి బెనర్జీ, జెట్టి ప్రమీల, రావుల రామకృష్ణతో కూడిన కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ మహాసభలో ఎ.కొండూరు మండలంలో కిడ్నీ వ్యాధి విస్తరించకుండా చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతంలో కిడ్నీ ఆసుపత్రిని నిర్మించాలని తీర్మానించారు. ఎ.కొండూరు నుంచి విసన్నపేట వెళ్లే రోడ్డు వెయ్యాలని రామచంద్రాపురంలో పెండింగ్‌లో ఉన్న నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధర కల్పించాలని, ఉపాధి హామీ పథకం ద్వారా 200 రోజులు పని కల్పించి రోజుకి రూ.600 వేతనం ఇవ్వాలని తీర్మానించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సందర్శన

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : నాగులూరు, రంగాపురం, రెడ్డిగూడెం గ్రామాల్లో పర్యటించిన తహశీల్దారు జి.సుశీల దేవి రెడ్డిగూడెం రైతులతో మాట్లాడారు. వర్షాలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలిపి పట్టాలు కప్పించి, ధాన్యాన్ని కాటా వేయించారు. లారీలను కూడా ఏర్పాటు చేయించారు. ప్రభుత్వం వారి రైతు సేవా కేంద్రాలను ఉపయోగించుకోవాలని, తేమశాతం ఎక్కువగా ఉన్న ధాన్యం కూడా కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. నీటి సంఘాల ఎన్నికలపై అవగాహన సదస్సు నిర్వహించారు. మంగళవారం నీటి సంఘాల ఎన్నిక మండలంలో డ్యూటీ పడిన అధికారులకు ట్రైనింగ్ క్లాస్‌లు కొత్త రెడ్డిగూడెం కళ్యాణ మండపంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. తహశీల్దార్ వెంట మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు

కాలుష్య నివారణపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ కాకాని వెంకటరత్నం కళాశాలలో నేషనల్ పొల్యూషన్ కంట్రోల్ డే సోమవారం నిర్వహించారు. ఎన్‌సిసి కాడెట్స్ ప్లాస్టిక్ కాలుష్య అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ పులి రజనీకాంత్ మాట్లాడుతూ కాలుష్య రహిత సమాజం కోసం అందరూ పాటు పడాలని చెప్పారు. ఇందులో కళాశాల బోటనీ అధ్యాపకులు సిహెచ్ కిషోర్, అసిస్టెంట్ లైబ్రేరియన్ అనంతరామి రెడ్డి పాల్గొన్నారు.

ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం రైతుల నుండి కల్లాల వద్దే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతు సంఘం డివిజన్ నాయకులు కాకనబోయిన లింగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని షేర్ మహమ్మద్ పేట గ్రామ సమీపంలోని అనుమంచిపల్లి రోడ్ లో గల కల్లాల వద్ద గల ధాన్యాన్ని రైతు, కౌలు రైతు సంఘం నాయకుల ఆధ్వర్యంలో సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులను ధాన్యం కొనుగోలు, ధాన్యం రేటును అడిగి తెలుసుకున్నారు. అనంతరం లింగారావు మాట్లాడుతూ ప్రస్తుతం మబ్బులు పట్టి వర్షం పడే అవకాశం ఉండటంతో ధాన్యాన్ని నిల్వచేసే పరిస్థితి లేదు కనుక 25 శాతం తేమ ఉన్నప్పటికీ తేమ కటింగ్ లేకుండా ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శులు దంతాల వెంకటేశ్వర్లు, కోటా కృష్ణ, రైతులు మార్తి చిన్న నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నీటి సంఘాల, సహకార బ్యాంకు సంఘాల ఎన్నిక

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : నీటి సంఘాలు, సహకార బ్యాంకు సంఘాల ఎన్నికల్లో జనసేన పార్టీ ప్రాతినిధ్యం బలంగా ఉంటుందని ఆ పార్టీ మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్కల రామ్మోహనరావు అన్నారు. స్థానిక జనసేనపార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షులు చాపలమడుగు కాంతారావు ఆధ్యక్షతన మండల, గ్రామ నాయకుల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జనసేన రాష్ట్ర అధికార ప్రతినిధి, మైలవరం నియోజకవర్గ ఇన్చార్జ్ అక్కల రామ్మోహన్ రావు (గాంధీ) ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో గాంధీ మాట్లాడుతూ త్వరలో జరగనున్న నీటి సంఘాల ఎన్నికల్లోను ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఎన్నికల్లో జనసేన ప్రాతినిధ్యం బలంగా ఉండాలని దీనికి నాయకులంతా సమాయత్తం కావాలని సూచించారు. మండల అధ్యక్షులు కాంతారావు మాట్లాడారు. మండల ఉపాధ్యక్షులు పాములపాటి సుందరరామిరెడ్డి, నాయకులు క్రాంతిబాబు, కొండపల్లి మణికంఠ, పడిశాల రమేష్, పీనానాయక్, ప్రవీణ్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం : నిమ్రా ఫార్మసీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ఆధ్వర్యంలో డిసెంబర్ 1 ప్రపంచ ఎయిడ్స్ డే సందర్భంగా సోమవారం ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ రహిత ప్రపంచాన్ని నిర్మిద్దామని, లక్ష్యం దిశగా అందరూ అవగాహన కలిగి ఉండాలని నినదించారు. రింగ్ చుట్టూ ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ అనేది అంటువ్యాధి కాదని, తాకటం, పక్కన నిలవడం వల్ల ఒకరి నుండి ఇంకొకరికి సంక్రమించదని తెలిపారు. తగిన జాగ్రత్తల ద్వారా వ్యాప్తిని అరికట్టవచ్చని ప్రజలకు విద్యార్థులు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం జనార్ధన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ చంద్రశేఖర్ నాయక్, కళాశాల అధ్యాపకులు రామకృష్ణ రెడ్డి, పల్లవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పైపులైన్ పనులు పరిశీలన

ప్రజాశక్తి - నందిగామ : కేసర నుంచి మంచి నీటి సరఫరా చేయు మెయిన్ పైపులైను లీకేజి అవడంతో పైపులైను మరమ్మతు చేయాలని సంబంధిత అధికారులను కమిషనర్ రమణ బాబు సోమవారం ఆదేశించారు. మున్నేరు వాగు నుంచి వచ్చే మంచి నీటి సరఫరా నిమిత్తం మున్నేరు వాగులో గల వాల్ పిట్స్‌ను 15వ ఆర్థిక సంఘ నిధులతో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేయించి జనవరి, 2025 మాసం కల్లా నందిగామ పట్టణ ప్రజలకు ఎటువంటి అంతరాయం కలగకుండా మంచినీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. చందర్లపాడు రోడ్డులోని రైతుబజారు పక్కన డ్రైనేజీని పరిశీలించిన సమయంలో రోడ్డు మీద నిర్మించిన డ్రైనేజీల మీద ఆక్రమంగా దుకాణాలు నిర్వహిస్తున్నారని దీంతో డ్రైనేజ అస్తవ్యస్తంగా ఉందన్నారు. నోటీసులు జారీ చేయకుండానే దుకాణాలు తొలగించినట్లు తెలిపారు. కమిషనర్ వెంట నందిగామ పురపాలకసంఘ మున్సిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్, వార్డు ఎమినిటీస్ సెక్రెటరీ వారలు పాల్గొనినారని తెలిపారు.


నందిగామలో మంచి నీటి పైపులైను పరిశీలిస్తున్న కమిషనర్

రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : పట్టణంలోని స్థానిక రెండో వార్డులో సుమారు రూ.5 లక్షల నిధులతో నిర్మించబోతున్న రోడ్డు పనులకు సోమవారం మున్సిపల్ ఛైర్మన్ రంగాపురం రాఘవేంద్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీలపై ప్రత్యేక దృష్టి సారించామని పట్టణాన్ని రోజు రోజుకు పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, గతంతో పోలిస్తే శానిటేషన్ వ్యవస్థ మెరుగైనట్లుగా ఉందని, ప్రజల నుండి ఫిర్యాదులు తగ్గాయని, స్థానిక ఎంఎల్‌ఎ శ్రీరాం రాజగోపాల్ తాతయ్య జగ్గయ్యపేట పట్టణ అభివృద్ధికి కృషి చేస్తున్నారని, పట్టణాన్ని రాష్ట్రంలోనే ప్రత్యేక గుర్తింపు పొందేలా జగ్గయ్యపేట పురపాలక సంఘం ముందుకు వెళుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ తుమ్మల ప్రభాకర్, పట్టణ కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, జనసేన నాయకులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


శంకుస్థాపన చేస్తున్న రంగాపురం రాఘవేంద్ర, తదితరులు

స్పీడ్ బ్రేకర్లు వేయాలని వినతి

ప్రజాశక్తి - జి కొండూరు : విజయవాడ రూరల్, కొత్తూరు తాడేపల్లి స్థానిక సెయింట్ బెండిక్ట్ స్కూలు వద్ద రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని జిల్లా సబ్ కలెక్టర్ నిధి మీనాకు స్కూల్ యాజమాన్యం, విద్యార్థుల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. స్కూలు ఎదురుగా భారీ టర్నింగ్ ఉందని దానివల్ల ఇరువైపులా వచ్చే వాహనాలు ఒకదానికొకటి కనిపించే పరిస్థితి లేదని పేర్కొన్నారు. జి.కొండూరు, విసన్నపేట నుండి విజయవాడ వెళ్ళు వాహనాలు రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల నిత్యం రద్దీగా ఈ రోడ్డు ఉంటుందని, ద్విచక్ర వాహనాలు కూడా వేగంగా ప్రయాణిస్తూ ఉంటాయని తెలిపారు. స్కూలుకు వెళ్లే చిన్న చిన్న పిల్లలు ఉదయం, సాయంత్రం రోడ్డు దాటాలంటే ఇబ్బంది కరంగా మారిందని. వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు రోడ్డుపై స్పీడ్ బ్రేకర్లు వేయాలని కోరారు.


వినతిపత్రం ఇస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

రీ టెండర్లో పాట రద్దు

ప్రజాశక్తి - జగ్గయ్యపేట : మండలంలోని వేదాద్రి గ్రామంలో గల శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానంలో ఆరు పాటలు సోమవారం రీ టెండర్ విధానం ద్వారా దేవస్థానం ఇఒ కానూరి సురేష్ పాటను నిర్వహించారు. ఈ రీ టెండర్లో ఐదు పాటలకు పాటదారులు ఆసక్తి చూపకపోవడంతో ఆ పాటలను రద్దు చేశారు. కొబ్బరి కాయలు – కిరాణా షాపుకి మూడు నెలల క్రితం రరూ.32.65 లక్షలు పాటను పాడి ఉండగా, ప్రస్తుతం అనంగి ఘంటయ్య రూ.32.70లక్షలతో షాపును రీ టెండర్ ద్వారా దక్కించుకున్నారు. ఈ సందర్భంగా కొబ్బరి కాయలు – కిరాణా షాపు గతంలో పాడిన పాటదారుడు మీడియాతో మాట్లాడుతూ పాటను దక్కించుకొన్ని రెండు నెలల కాలంలో రూ.11 లక్షలు నగదును చెల్లించానని, ప్రస్తుతం రూ.ఐదు లక్షల నగదును చెల్లిస్తానని, మిగిలిన మొత్తం రూ.16.65 లక్షలు నగదును త్వరలో చెల్లిస్తానని చెప్పిన ఇ.ఓ. రీ టెండర్ పిలిచి తమకు అన్యాయం చేశారని వాపోయాడు. ఈ విషయమై శ్రీ యోగానంద నరసింహ స్వామి దేవాలయం, వేదాద్రి టెంపుల్ ఇఒ కానూరి సురేష్‌ని వివరణ కోరగా ఆయన మాట్లాడుతూ గతంలో పాత పాటదారులు మొత్తం నగదును చెల్లించని కారణంగా, వారికి నోటీసులు ఇచ్చి రీ టెండర్ చట్ట ప్రకారమే పిలిచామన్నారు. కొత్తగా పాడిన వారు మొత్తం నగదును చెల్లించగానే వెంటనే పాడిన షాపును అప్పగించడం జరుగుతుందన్నారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఫణి కుమార్, కెసిపి పర్సనల్ మేనేజర్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

రెండు వర్గాల మధ్య ఘర్షణ

ప్రజాశక్తి - మైలవరం : సాగునీటి సంఘాల అభ్యర్థుల విషయమై అధికారకూటమిలో రెండు వర్గాల మధ్య సోమవారం రాత్రి ఘర్షణకు దారితీసింది. సాగునీటి సంఘాల అభ్యర్థుల ఎన్నిక నోటిఫికేషన్ ఈనెల 5వ తేదీన వెలవడుతున్న నేపథ్యంలో మండలంలోని చంద్రగూడెం గ్రామంలోని కూటమి నాయకుల మధ్య ఏకాభిప్రాయం లేకపోవడంతో సోమవారం సాయంత్రం మైలవరంలోని ఎమ్మెల్యే కార్యాలయం వద్దకు చంద్రగూడెం గ్రామానికి చెందిన టిడిపి, జనసేన నాయకులు చేరుకున్నారు. టిడిపిలో నాయకులు రెండు వర్గాలుగా, జనసేనలో నాయకులు రెండు వర్గాలుగా విడిపోయారు. అభ్యర్థి ఎంపిక విషయమై నాయకులు మధ్య ఏకాభిప్రాయం కుదరకపోవడంతో మాట పెరగటంతో ఘర్షణకు దిగారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి నాయకులను అక్కడి నుంచి పంపివేయటంతో గొడవ సర్దుమణిగింది.

కవులకు సత్కారం

ప్రజాశక్తి - వత్సవాయి : మండలంలోని చిన్న మోదుగు పల్లి గ్రామంలో ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్న మార్య పూడి జయశ్రీ సహానాజ్‌కు కవుల సమ్మేళనంలో భాగంగా సత్కారం అందింది. విజయవాడ లోని విజయవాడ బుక్ ఫెస్టివల్ ప్రాంగణంలో తెలుగు పోయెట్రి ఫెస్టివల్‌లో భాగంగా, అమరావతి ఆర్ట్ ఫౌండేషన్ వారి తొలి కార్యక్రమంలో భాగంగా జరిగిన శత కవుల సమ్మేళనంలో ఈ సత్కారం అందుకున్నారు. కవితా పఠనం చేసిన జగ్గయ్యపేటకు చెందిన ఉపాధ్యాయురాలు ప్రముఖ కవయిత్రి మార్యపూడి జయ శ్రీ షహనాజ్ ను సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కళారత్న డా. పొట్లూరి హరికృష్ణ, ప్రముఖ సంఘ సేవకులు కళా పోషకులు గోళ్ళ నారాయణ, సాహితీవేత్త యస్.డి.సుభాని, ప్రముఖ సాహితీవేత్త బివివి సత్యనారాయణ, అమరావతి ఆర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షురాలు కె.విజయలక్ష్మి , స్వహస్తాల మీదగా జ్ఞాపిక, శాలువ, ప్రశంసా పత్రం అందించారు. ఈ కార్యక్రమం లో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి శత కవులు, కవయిత్రులు పాల్గొన్నారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి - మైలవరం : మండలంలోని పలు గ్రామాల్లో కోడిపందేలు నిర్వహిస్తున్న శిబిరంపై దాడి చేసి 47 మంది జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు సిఐ దాడి చంద్రశేఖర్ సోమవారం తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మైలవరం మండలంలోని పుల్లూరు, పోరాటనగర్ గ్రామ శివారులలో నిర్వహిస్తున్న కోడి పందాల శిబిరంపై ఎసిపి వై.ప్రసాదరావు ఆధ్వర్యంలో దాడి చేయగా 47 మందిని అదుపులోకి తీసుకొని వారి నుండి రూ. 29,100 నగదును, 10 కోడిపుంజులను, 10 కత్తులను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడిలో ఎస్ఐ కె.సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

కలగర పంచాయతీలో కొలికపూడి పర్యటన

ప్రజాశక్తి - విస్సన్నపేట : విసన్నపేట మండలం పంచాయతీలో సోమవారం తిరువూరు ఎంఎల్‌ఎ కొలికపూడి శ్రీనివాసరావు పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన పలు సమస్యలను ప్రజల నుండి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అయ్యప్ప స్వాములు ఇరుముళ్ళ నిమిత్తం బయలుదేరు కార్యక్రమంలో పాల్గొని భోజనం వడ్డించారు. స్వాములు ఎంఎల్‌ఎను సత్కరించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రైస్ మిల్లు వద్ద లారీలు బారులు తీరిన దృశ్యం

రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - గుడివాడ : ప్రభుత్వం రైతుల విషయంలో సరైన వైఖరిని అవలంభించకపోవడం వల్ల ధాన్యం దిగుమతి విషయంలో రైస్‌మిల్లర్లు ఇష్టానుసారంగా ప్రవర్తిస్తుడడం వల్ల రైతులు, కౌలు రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే ప్రభుత్వం మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సిపిఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సిపి రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక అంజనేయపేటలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆర్‌సిపి రెడ్డి మాట్లాడుతూ గుడివాడ డివిజన్‌లో రైస్‌మిల్లర్లు ధాన్యం దిగుమతి సక్రమంగా చేయకపోవడం వల్ల ధాన్యం లారీలు 4, 5 రోజులు మిల్లుల వద్ద నిలిచిపోవలసి వస్తుందన్నారు. తడిసిపోయిన ధాన్యం లారీలో ఉండటం వల్ల రంగుమారుతోందన్నారు. దీనివల్ల రైతులు నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం మాత్రం ఇబ్బందులు లేకుండా ధాన్యం సేకరిస్తున్నట్లు ప్రకటనలు చేస్తుందన్నారు. ప్రభుత్వం వెంటనే దిగుమతి విషయంలో చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం సీనియర్ నాయకులు నీలం మురళీకృష్ణారెడ్డి, ఐద్వా పట్టణ కార్యదర్శి పి రజిని, సాహితీ స్రవంతి కార్యదర్శి ఎల్.సురేంద్ర పాల్గొన్నారు.



వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గన్నవరం : స్థానిక షాలోంప్రార్థనా మందిరంలో మొట్టపర్తి చంద్రా సుబ్బారావు జ్ఞాపకార్థం మొట్టపర్తి కాశీ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం నిరుపేద వృద్ధులకు దుప్పట్లు వికేఆర్ ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు చేతుల మీదుగా పంపిణీ చేశారు. వందమంది నిరుపేదలకు సహాయం చేయడంలో దాతల సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. ఎంఈఎఫ్ నాయకులు దేవరపల్లి ఏసుబాబు, పాస్టర్లు టి. దేవ సహాయం, విజయకుమారి, రిటైర్డ్ బ్యాంక్ మేనేజర్ దేవరపల్లి జయరాజు, లాయర్ సిహెచ్.విజయ్ కుమార్, పెద్దలు బాల శ్రీనివాస్, నార్ల సురేష్ పాల్గొన్నారు.

ఫసల్ బీమా యోజనను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : ప్రధానమంత్రి ఫసల్ భీమ యోజన" పథకం రైతులు సద్వినియోగం చేసుకునే విధంగా వారిలో అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకం అమలు జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీ సమావేశం సోమవారం కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకం మంచి పథకమని, ప్రీమియం చాలా తక్కువ, రైతులకు పంట నష్టం జరిగినప్పుడు భీమా మొత్తం రైతులకు అందుతుందని, పథకం ప్రయోజనాలు రైతులకు వివరించి ఆసక్తి గల రైతులందరిని నమోదు చేయాలన్నారు. రబీలో పంట రుణాలు పొందిన రైతుల నుండి ప్రీమియం కట్టించుకుంటారని, అదేవిధంగా రుణాలు తీసుకోని రైతులు కూడా ప్రీమియం చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రీమియం వివరాలు కలెక్టర్ తెలియజేస్తూ రబీలో ప్రతి ఎకరాకు ప్రీమియం మినుము 80 రూపాయలు, జొన్న, ధాన్యం 84 రూపాయలు, పెసలు 36 రూపాయలు మాత్రమే అన్నారు. జిల్లాలో సాధ్యమైనంత ఎక్కువమంది ఈ పథకం వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం వ్యవసాయ శాఖ ముద్రించిన బ్రోచర్ కలెక్టర్ ఈ సమావేశంలో విడుదల చేశారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎన్ పద్మావతి, కే డి సి సి బ్యాంక్ సీఈవో ఏ శ్యామ్ మనోహర్, ఎల్ డి ఎం సి రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

మంచినీటి పథకాన్ని అందుబాటులోకి తేవాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న జనసేన నాయకులు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలో కోట్ల రూపాయలు వెచ్చించి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు నిర్మించిన రక్షత మంచినీటి పథకాన్ని వినియోగంలోకి తేవాలని జనసేన పట్టణ అధ్యక్షులు రాజనాల వీరబాబు.. గ్రామ సర్పంచ్ గోరుముచ్చు ఉమా, కార్యదర్శి అనితలకు వినతిపత్రం అందజేశారు. సోమవారం పంచాయతీ కార్యాలయం వద్ద వీరబాబు జనసేన కార్యకర్తలతో కలిసి పంచాయతీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా సర్పంచి కార్యదర్శులకు వినతిపత్రం అందజేసి విలేకరులతో మాట్లాడారు. అవనిగడ్డ నడిబొట్టున ఉన్న గుర్రపు చెరువు ద్వారా ఫిల్టర్ బెడ్లలో నీటిని నింపి స్వచ్ఛమైన తాగునీటిని గ్రామ ప్రజలకు అందించాలని 2005లో ప్రతిష్టాత్మకంగా రూ కోటి 70 లక్షల రూపాయలతో చెరువుకు మరమ్మతులు చేయించి ఫెన్సింగ్ వేయించి ఫిల్టర్ బెడ్లు నిర్మించి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేసి ఆనాటి గవర్నర్ చేతుల మీదుగా పథకాన్ని ప్రారంభించారన్నారు. అతి తక్కువ కాలంలోనే ఫిల్టర్ బెడ్లు దెబ్బతిని మంచేటి సరఫరా ఇబ్బందికరంగా ఉందని దానిని రిపేరు చేయించి మరల ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ జనసేన ప్రధాన కార్యదర్శి బోగిరెడ్డి నాగేశ్వరరావు బచ్చు వెంకట కష్ణారావు తదితరులు పాల్గొన్నారు

రైతు, కౌలు రైతులకు శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ వీరపనేని మురళీధరరావు మీటింగ్ హాల్‌లో 4 మండలాల రైతు, కౌలు రైతుల పది గ్రామాల కార్యకర్తలకు 40 మందికి కౌలురైతు, రైతు సంఘాల ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు సోమవారం నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులను రైతు సంఘం జిల్లా నాయకులు నీలం మురళీకష్ణారెడ్డి ప్రారంభ వుపన్యాసం చేస్తూ గ్రామాల్లో గ్రామ కమిటీలు వేసి సభ్యత్వం చేర్పించి సంఘాన్ని బలోపేతం చేయాలని పిలుపు నిచ్చారు. కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు, జొన్న పాడు కౌలు రైతు సంఘం నాయకులు వేమూరి జనార్ధన్, పొదిలి వెంకటేశ్వరరావు, పుట్టి వెంకటేశ్వరవు, డొక్కు గోవర్ధనరావు, పేరుమాళ్ల దేవదానం, వ్యవసాయ కార్మిక సంఘం గుడ్లవల్లేరు మండలం అధ్యక్షురాలు రమాదేవి కౌలు రైతు సంఘం గుడివాడ రూరల్ అధ్యక్షులు లేళ్ల రాంబాబు, ఎస్.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి సమరం, ఐద్వా కార్యదర్శి రజని, టిడ్కో కాలనీ కార్యదర్శి బి.అరుణ పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి లక్ష్యసాధన తప్పనిసరి

ప్రజాశక్తి గన్నవరం : మండలంలోని ముస్తాబాద జడ్పీహైస్కూల్ పదవ తరగతి విద్యార్థులకు సోమవారం ఎస్ఆర్ఎం యూనివర్శిటీ ఫారీ స్కూల్ ఆఫ్ బిజినెస్ పీజీ విద్యార్థులు కెరీర్ గైడెన్స్ పై అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థికి లక్ష్యసాధన తప్పని సరిగా ఉండాలని సూచించారు. అప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదుగుతారని చెప్పారు. హెచ్ఎం రామ్ గోపాల్, శశాంక్ చౌదరి, హితేష్ పాత్రో, గౌరీ శంకర్, సోమశేఖర్, రఫియా షేక్, బిలియంత్ గుమిడి పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన అంతర్ కళాశాలల టేబుల్ టెన్నిస్ పోటీలు



ప్రజాశక్తి, గుడ్లవల్లేరు : స్థానిక శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న జెయన్‌టియు అంతర్ కళాశాల పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీలలో యూనివర్శిటీ అనుబంధ కళాశాలల నుండి 80 మంది బాలురు 40 మంది బాలికలు పాల్గొన్నారు. ఈ పోటీలను కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. కరుణ కుమార్ ప్రారంభించారు. ఈ పోటీలు అత్యంత ఉత్కంఠభరితంగా సాగాయి. ఈ పోటీల ముగింపు, బహుమతి ప్రధానోత్స వంనకు జె.యన్. టి. యూనివర్శిటీ క్రీడల కార్యదర్శి డా. జి. శ్యామ్‌కుమార్ ముఖ్య అతిధిగా విచ్చేశారు. ఈ బహుమతులు మహిళల విభాగంలో మొదటి బహుమతి యస్. ఆర్. గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల, ద్వితీయ బహుమతి స్వర్ణాధ్ర ఇంజనీరింగ్ కాలేజీ, మూడవ బహుమతి పి.వి.పి.యస్. ఐ.టి., వి.ఆర్. సిద్దార్థ ఇంజ నీరింగ్ కళాశాలలు కానూరు కైవసం చేసుకున్నాయి.

పురుషుల విభాగంలో ప్రధమ స్థానం జె.యన్.టి.యు. కాకినాడ, ద్వితీయ స్థానం వాసవి ఇంజినీరింగ్ కాలేజీ తాడేపల్లిగూడెం, తతీయ స్థానాలలో గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కాలేజీ మరియు యస్. ఆర్.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల, భీమవరం కళాశాలలకి వచ్చాయి. తదనంతరం నిర్వహించిన యూనివర్శిటీ టీము ఎంపికలు నిర్వహించారు. మహిళల విభాగంలో యస్.కె. పర్వీన్, ఎ.హెచ్. సంకీర్తన (గుడ్లవల్లేరు కాలేజి) పి. హర్షిత (గుడ్లవల్లేరు) డి. సునీత (యస్.ఐ.టి నర్సాపూర్) బి. నిఖిత 'గాయత్రి విద్యా పరిషత్ విశాఖపట్టణం), పురుషుల విభాగంలో ఎ.డి. మణికంఠ, డి.శ్యామ్ సన్ అశోక్ (యూనివర్శిటీ కాలేజీ కాకినాడ) యన్.గణేష్ (యస్.వి ఇ.సి తాడేపల్లి గూడెం) జి. నాగవైభవ్ (పొట్టి శ్రీరాములు విజయవాడ) షేక్ అబ్దుల్ రియాన్ (నిమ్రా కాలేజి, విజయవాడ)లు ఎంపికయ్యారు. ఎంపికైన మహిళల టీం జనవరి 3 నుండి 5 వరకు అమిత్ యూనివర్శిటీ చెన్నయ్‌లో జరుగు ధక్షిణ బారత అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో పాల్గొంటారని కళాశాల ప్రిన్సిపాల్ డా. బి. కరుణ కుమార్ తెలిపారు. పురుషుల టీమ్ ఈనెల 10 నుండి 14 వరకు విట్, వెల్లూరు చెన్నయ్ లో జరుగు అంతర్ విశ్వవిద్యాలయ పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమములో కళాశాల వైస్ ప్రిన్సిపాల్స్ డా. పి. కోదండ రామారావు, డా.యమ్. ఆర్. సి. హెచ్ శాస్త్రి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ, కళాశాల ఫిజికల్ డైరక్టర్ యమ్. శివశంకర్, మరియు జె. వెంకటేశ్ వివిధ కళాశాలల ఫిజికల్ డైరక్టర్స్, కోచ్ లు పాల్గొన్నారు.

అసత్యప్రచారాలు తగదు



ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ పై ప్రతిపక్ష నాయకులు మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బురద జల్లడం హాస్యాస్పదమని పలువురు కూటమి నాయకులు విమర్శించారు. సోమవారం సాయంత్రం టిడిపి, జనసేన, బిజెపి పార్టీల ఆధ్వర్యంలో అవనిగడ్డ రాజీవ్ సెంటర్లో ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ నిర్మాణాత్మకమైన అభివద్ధి చేస్తున్న బుద్ధ ప్రసాద్ పై అసత్యాలు ప్రచారం చేయరాదని కోరారు. రాజకీయ లబ్ధి కోసం అవాకులు చవాకులు పేలి తమ పార్టీని బలోపేతం చేసుకోవాలని ప్రయత్నం మానుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి కొల్లూరి వెంకటేశ్వరరావు, కోడూరు టిడిపి మండల అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు పార్టీ నాయకులు వన్డే రాఘవ , జనసేన పట్టణ పార్టీ అధ్యక్షులు రాజనాల వీరబాబు, పాల్గొన్నారు

నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-చల్లపల్లి : ప్రముఖ పారిశ్రామికవేత్త, గ్రీన్ స్టోన్ ఇంచార్జ్, ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చీఫ్ మేనేజింగ్ డైరెక్టర్ అప్పికట్ల అప్పారావు పుట్టినరోజు వేడుకలు సోమవారం సనక భరత్ రావు ఫ్రెండ్ సర్కిల్ ఆధ్వర్యంలో స్థానిక పార్వతమ్మ తోటలోని ఆదరణ వద్ధాశ్రమంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా వద్ధులందరికీ స్వీట్స్ కేక్స్ ఫ్రూట్స్ పంచిపెట్టి మూడు వేల రూపాయల విలువగల నిత్యవసర సరుకులు ఆశ్రమ నిర్వాహకులకు అందించారు

అన్నక్యాంటీన్‌లో అన్నదానం

ప్రజాశక్తి - గుడివాడ : అబ్దుల్ ఖాదర్ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు అబ్దుల్ సుభాన్ ఆధ్వర్యంలో సోమవారం అన్నా క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏపిఎన్జీవో అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఫరీద్ భాషా, నవభారత్ ఖాదీ స్టోర్స్ అధినేత సయ్యద్ గఫార్, ఫ్రెండ్స్ అండ్ ప్రోగ్రెసివ్ కన్వీనర్ డి.ఆర్.డి ప్రసాద్, పి.ఎస్.ఆర్ ప్రసాద్, పల్లపోతు వెంకటేశ్వరరావు అన్నా క్యాంటీన్ ఉద్యోగులు షేక్ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

మద్దతు ధర ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం



ప్రజాశక్తి-కంకిపాడు : రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఇవ్వటంలో ప్రభుత్వం విఫలమైందనిరైతు సంఘం నాయకులు వేమూరి నాగేశ్వరావు అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కంకిపాడు మండలంలో పలు గ్రామాలలో పౌరసరఫరాల శాఖామంత్రి నాదెండ్ల మనోహర్ పర్యటించి వాతావరణ పరిస్థితుల కారణంగా ధాన్యంలో ఎంత తేమశాతం ఉన్నా ఐదు శాతం మాత్రమే తగ్గించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలని చెప్పినా మిల్లర్లు పది పన్నెండు శాతం వరకు తగ్గిస్తూ మంత్రి ఆదేశాలకు తూట్లు పొడుస్తున్నారన్నారు. మిల్లర్లు, అధికారులు కుమ్మక్కై రైతులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని, 48 గంటల్లోనే ధాన్యం తోలిన తర్వాత డబ్బులు చెల్లిస్తున్నామని చెబుతున్నారు కానీ కంకిపాడు మండలంలో కొంతమంది రైతులకు పది రోజులైనా ధాన్యం డబ్బులు రాలేదని ఆవేదన చెందుతున్నారు. ఆ డబ్బులు విషయమై కంకిపాడు రైతు సేవా కేంద్రం ఉద్యోగులకు ఎన్నిసార్లు ఫోన్ చేసినా వారు ఫోను ఎత్తటం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రైతులకు తగు న్యాయం చేయాలని ఆయన కోరారు.

మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులపై అవగాహన

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : మ్యూచువల్ ఫండ్స్ ఇతర పెట్టుబడుల్లోలో పెట్టుబడి పెట్టే పెట్టుబడి దారులకు అవగాహన కలిగించడానికి ఎస్‌బిఐ స్మార్ట్‌గా ఒక చొరవను మొదలుపెట్టిందని ఆ సంస్థ ప్రతినిధి రవి కుమార్ తెలిపారు. నగరంలోని ఓ హోటల్‌లో సోమవారం అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెట్టుబడి పెట్టేటప్పుడు అధిక-రిస్క్ ఈక్విటీ, తక్కువ రిస్క్ డెట్, వస్తువుల (బంగారం, వెండి మొదలైనవి) వంటి ద్రవ్యోల్బణానికి వ్యతిరేకంగా హెడ్జ్‌లు వంటి రిస్క్-రిటర్న్ పరంగా పరస్పర సంబంధం లేని ఆస్తి తరగతుల మధ్య ఎంచుకునే గందరగోళం తరచుగా ఎదురవుతుందని చెప్పారు.

మిర్చి పంటపై మందు చల్లిన ఆగంతకులు



ప్రజాశక్తి - గంపలగూడెం : తాను సాగు చేస్తున్న మిర్చి పంటపై గైసిల్ (గడ్డి మందు) కొట్టారని గంపలగూడెం గ్రామ రైతు (రెడ్డి బజారు)కు చెందిన రేగళ్ల నరసింహారెడ్డి వాపోయారు. సదరు పంటకు సంబంధించిన వివరాలు సోమవారం ప్రజాశక్తికి వివరించారు. సర్వే నంబర్ 117/1 ఒకటిలో 92 రెండు సెంట్లు, 117/3 లో నలభైన్నర సెంట్లు మెరక భూమి ఉన్నట్లు చెప్పారు. అందులో ఈ ఏడాది మిర్చి పంట సాగు చేస్తున్నట్లు వివరిస్తూ, తన పంటపై గుర్తు తెలియని వ్యక్తులు గైసిల్ స్ప్రే చేసినట్లు వివరించారు. మూడు రోజుల క్రితం యధావిధిగా తన పంటను పరిశీలించేందుకు ఉదయాన్నే వెళ్లగా అప్పటికే కొంత భాగం ఎర్రబారినట్లు వివరించారు. మరో పూట చూడగా, అది పూర్తిగా ఎండినట్లు గుర్తించా నన్నారు. ఈ విషయమై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తానని చెప్పాడు. తన పంటపై జరిగిన ఈ చర్యపై పరిశీలన చేసి తగు న్యాయం చేయాలని నరసింహారెడ్డి కోరుతున్నాడు.

క్రిస్మస్‌కు ముస్తాబవుతున్న చర్చిలు



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మండలంలో క్రిస్మస్ సందడి ప్రారంభమైంది. వచ్చే నాలుగు ఆదివారాల్లో హోప్, పీస్, జాయ్, లవ్ అనే నాలుగు అంశాలను ధ్యానిస్తూ క్రీస్తు పుట్టుకను తెలిపే గేయాలు, పాటలతో ఆనందంగా గడుపుతారు. మండలంలో గల అన్ని చర్చిలను అందంగా తీర్చిదిద్దేందుకు కొత్త రంగులు అద్ది, రంగురంగుల విద్యుత్ దీపాలు, స్టార్‌లతో ముస్తాబు చేస్తున్నారు. రాబోయే మూడు వారాల్లో చర్చిలను లోపల అలంకరణతో కళ్ళు మిరుమిట్లు గొలిపేలా డెకరేషన్ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నవంబర్ 25 నుండి అన్ని చర్చిల్లో ఆనందంగా క్రిస్మస్ గీతాలను ఆలపిస్తూ ఉన్నారు. మరి కొద్ది రోజుల్లో క్రిస్మస్ కేరల్స్, శాంతాక్లాజ్ గృహ దర్శనాలు ప్రారంభమవుతాయి. మండల కేంద్రంలో గల సిఎస్ఐ క్రైస్ట్ చర్చి విద్యుత్ దీపాల వెలుగులో సుందరంగా కనిపిస్తుంది.

అర్హులైన పేదలకు ఇంటి స్థలం కేటాయించాలి

ప్రజాశక్తి - జి.కొండూరు : అర్హులైన పేదలకు మూడు సెంట్ల ఇంటి స్థలం, రూ.5 లక్షలు గృహ నిర్మాణానికి ఇవ్వాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. మైలవరం నియోజకవర్గ కార్యదర్శి బుడ్డి రమేష్ బాబు ఆధ్వర్యాన కవులూరు గ్రామ సచివాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. కవులూరు గ్రామ కార్యదర్శి డి.శ్రీనివాసరావు వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు ఎస్‌కె.రబ్బానీ పాల్గొన్నారు.

సారా కేసుల్లో ఇద్దరు అరెస్ట్

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ మైలవరం పరిధిలో చేసిన దాడులలో రెడ్డిగూడెం మండలం రెడ్డిగూడెం గ్రామంలో చాట్ల బండయ్య అనే వ్యక్తి సారా అమ్ముతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 4 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఒక పాత కేసులో అరెస్ట్ చేయ వలసిన ముద్దాయి కోమటి గోపయ్యను అరెస్ట్ చేసి రిమాండ్‌కి జైలుకి పంపినట్లు ఎక్సైజ్ ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు. దాడుల్లో ఎస్ఐ దుర్గా ప్రసాద్, హెచ్‌సిలు కుమారస్వామి, నాగరాణి, సిబ్బంది రమేష్, సాయికృష్ణ, రాజకుమార్ పాల్గొన్నారు

ఎం. జె.నాయుడు ఆస్పత్రిలో

విజయవంతంగా మోకాళ్ళ మార్పిడి చికిత్స



వివరాలు తెలుపుతున్న వైద్యులు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : మోకాళ్ళు పూర్తిగా అరుగుదల సమస్యతో బాధపడే వారికి ఆంధ్రప్రదేశ్‌లోనే ప్రప్రథమంగా ఆగ్మెంటెడ్ రియాలిటీ టెక్నాలజీ ద్వారా మోకాళ్ళ మార్పిడి శస్త్ర చికిత్సను విజయవంతంగా చేసినట్లు డాక్టర్ ఎం.జె.నాయుడు, డాక్టర్ వంశీ కష్ణ తెలిపారు. సూర్యారావుపేటలోని డాక్టర్ ఎం జె నాయుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో శస్త్ర చికిత్సకు సంబంధించిన వివరాలను డాక్టర్ ఎంజె.నాయుడు, డాక్టర్ వంశీ కృష్ణ వివరించారు. కృష్ణాజిల్లా గంగూరు ప్రాంతానికి చెందిన 56 సంవత్సరాల అక్సర్ అనే మహిళ మూడేళ్ల నుంచి మోకాళ్ళ వంకర, అరుగుదల సమస్యతో నడక కూడా ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో తమను సంప్రదించినట్లు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం మోకాలు పూర్తిగా అరిగిపోవడాన్ని గ్రేడ్ 4 స్టేజ్‌గా గమనించామని జాయింట్ రీప్లేస్‌మెంట్ ఆపరేషన్ చేయాలని సూచించినట్లు తెలిపారు. పూర్తిగా అరిగిపోయిన మోకాళ్ళ జాయింట్‌ను ఆగ్మెంటెడ్ రియాలిటీ టెక్నాలజీ ద్వారా అతి తక్కువ వ్యవధిలో శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. గతంలో రోబోటిక్ ద్వారా సర్జరీలు జరిగేవని అవి కూడా సత్ఫలితాలు ఇచ్చేవని అయితే మారుతున్న కాలానుగుణంగా శస్త్ర చికిత్సలో కూడా మార్పులు తీసుకు వచ్చినట్లు తెలిపారు. ఆగ్మెంటెడ్ రియాలిటీ టెక్నాలజీ ద్వారా మోకాళ్ళ మార్పిడి సర్జరీని త్వరితగతిన పూర్తి చేయవచ్చని సర్జరీ అనంతరం ఒక్కరోజు వ్యవధిలోనే పేషెంట్ నడవగలు గుతున్నారని తెలిపారు. మోకాళ్ళ అరుగుదల సమస్యతో బాధపడే వారికి ఈ సర్జరీ ఎంతగానో దోహద పడుతుందని వారు వివరించారు. కండకోత తక్కువగా ఉంటుందని, నొప్పి తక్కువగా ఉంటుందని, ఈ సర్జరీ ద్వారా జాయింట్ జీవితకాలం కూడా పెరుగుతుందన్నారు. విలేకరుల సమావేశంలో ఆర్థోపెడిక్ వైద్యులు డాక్టర్ రవితేజ డాక్టర్ రఘురాం, అనస్తీషియా వైద్యులు రవికుమార్ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - జి.కొండూరు : జిల్లా వ్యాప్తంగా ప్రారంభమైన పత్తి కొనుగోలు కేంద్రాల్లో కొనుగోళ్లు జరిగేలా చేయాలని సోమవారం ఎపి రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పగడాల ఆంజనేయులు మాట్లాడుతూ జిల్లాలోని జగ్గయ్యపేట నందిగామ, కంచికచర్ల, మైలవరం, ఎ.కొండూరు, తిరువూరులో సిసిఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినా కొనుగోలు చేయట్లేదన్నారు. పత్తి కొనుగోలులో వ్యాపారుల అక్రమాలు పెరిగిపోయాయని రైతు అన్ని రకాల ఒడిదుడుకులను ఎదుర్కొని పండించి అమ్మేందుకు మార్కెట్‌కు తెచ్చిన రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా పత్తి వ్యాపారులు ధరలు తగ్గించి రైతులకు తీవ్రమైన నష్టం కలిగిస్తున్నాయన్నారు. గత ఏడాది క్వింటాకు పన్నెండు వేలు పలికిన పత్తి ధర ఈ ఏడాది ప్రారంభంలో రూ.10వేల నుంచి క్రమంగా తగ్గుతూ నేడు 6,400 నుండి 7వేలకు పడిపోయిందన్నారు. ఒకవైపు పత్తి విత్తనాలు ఎరువులు, క్రిమిసంహారక మందులు ధరలు, వ్యవసాయ ఉపకరణాల ధరలు వ్యవసాయ కూలీలకు ధరలు అన్ని పెరిగిపోవడం ఒక ఎత్తైతే, అధిక వర్షాలు, చీడ, పీడలు, తెగుళ్లన్నింటినీ తట్టుకుని పంటలు పండించడం మరో ఎత్తన్నారు. కేంద్ర ప్రభుత్వం 2024 ఖరీఫ్ సీజన్లో క్వింటాకు రూ.7,521 లు మద్దతు ధర ప్రకటించిందన్నారు. కనీసం ఆ మద్దతు ధర కూడా అమలు చేయలేని వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని పత్తి కొనుగోలులో సిసిఐ కేవలం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి కొనుగోలు చేయకుండా కాలం వెళ్ళదీస్తుందని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్, సిఐటియు నాయకులు తాళ్లూరి నరసింహారావు, రైతులు పాల్గొన్నారు.

మహిళల పట్ల గౌరవ భావం ఉండాలి

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సమాజంలో మహిళలపై జరుగుతున్న అకృత్యాల గురించి ప్రముఖ గైనకాలజిస్టులు తాళ్లూరి రామకోటేశ్వరావు, కొడాలి సుజాత బహుదూర్ సోమవారం అవగాహన కల్పించారు. డాక్టర్ సుజాత మాట్లాడుతూ సమాజంలో మహిళల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవ భావంతో ఉంటే స్త్రీలు స్వేచ్ఛగా ఏ రంగంలోనైనా పైకి వస్తారన్నారు. డాక్టర్ రామ కోటేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో మహిళ స్థానం ఉన్నతమైనదని, ఆ విధంగా ప్రతి ఒక్కరూ మహిళలను గౌరవిస్తూ వారి పట్ల మంచిగా నడుచుకోవాలన్నారు. ఈ సందర్భంగా మహిళల గొప్ప దనాన్ని ఆసుపత్రి సిబ్బంది వివరించారు. పాఠశాల ఇన్ ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు కె.శంకరరావు పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు విడుదల చేయాలి



నూతన కమిటీ సభ్యులు

ప్రజాశక్తి - కంచికచర్ల : పెండింగ్‌లో ఉన్న స్కూల్ ఆయాలు 5 నెలలు జీతాలు తక్షణమే విడుదల చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఎం.సోమేశ్వరరావు అన్నారు. కంచికచర్ల మండల ప్రభుత్వ పాఠశాలల ఆయాల సమావేశం సోమవారం సిఐటియు మండల అధ్యక్షుడు బెజ్జం భూషణం అధ్యక్షతన జరిగింది. సోమేశ్వరరావు మాట్లాడుతూ సమాజంలో అట్టడుగున ఉన్న పేదవర్గాల వారు ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో అనేక దశాబ్దాలుగా శానిటేషన్ కార్మికులుగా అతి తక్కువ వేతనాలతో పనిచేస్తున్నారన్నారు. వీరికి దాదాపు 4 నెలల నుండి వేతనాలు పెడింగ్‌లో ఉన్నాయన్నారు.. సెప్టెంబర్ 2న ప్రభుత్వం జిఒ నెం.413 విడుదల చేసిందన్నారు. 2 నెలలకు సగంవేతనాలు చెల్లించారని, 4 నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయని అన్నారు. పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 300ల మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలనే ప్రభుత్వ నిర్ణయాన్ని పున్న పరిశీలించాలని కోరారు. 50 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించాలని కోరారు. ప్రతినెల 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, గుర్తింపు కార్డులివ్వాలని, శానిటేషన్ పరికరాలు ప్రభుత్వమే సరఫరా చేయాలని, ప్రమాద బీమాసౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. సంవత్సరానికి రెండు జతల యూనిఫాం ఇవ్వాలని, రాజకీయ కక్షసాధింపులతో వర్కర్ల తొలగింపులు ఆపాలని, స్థానికంగా ఉన్న ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మండల నూతన కమిటీ

ప్రెసిడెంట్ - యాశోద, కార్యదర్శిగా రజిని, వైస్ ప్రెసిడెంట్‌గా శీనమ్మ, గాయత్రి, జాయింట్, కోశాధికారి శారదా, మండల కమిటీ సభ్యులుగా ఖాసీంబి, ప్రత్యూష, శివ, గౌసియా, సుజాత రాజేశ్వరి, ఎం.నాగమణి శతదితరులు పాల్గొన్నారు.



కార్తీకమాస కార్యక్రమంలో సౌమ్య

ప్రజాశక్తి - నందిగామ : కార్తీక మాసం గౌరీ పాడ్యమిని పురస్కరించుకొని నందిగామ మండలం పల్లగిరి కొండపై శివాలయం గ్రామస్తులు కూటమినేతలతో కలిసి పాడ్యమి భోజనాల్లో రాష్ట్ర ప్రభుత్వ విప్, నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య పాల్గొన్నారు.తంగిరాల సౌమ్య మాట్లాడుతూ తెలుగునాట మహిళలంతా పోలిని తల్చుకుంటూ అమావాస్య రోజు ఉదయాన్నే అరటిదొప్పలలో వత్తులను వెలిగించి నీటిలో వదులుతారని తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - విజయవాడ : ఘంటసాల గాన అవధానం విజయవాడలో అద్భుతంగా అలరించింది. డాక్టర్ సయ్యద్ రహంతుల్లా ఘంటసాల గాన అవధానం, ఘంటసాల పాటల కబడ్డీ, లఘు నాటికలు ప్రేక్షకుల్ని ఆకట్టుకున్నాయి. ఘంటసాల 102 జయంతి సందర్భంగా విజయవాడ శ్రీ హనుమంతరాయ గ్రంథాలయంలో డిసెంబర్ మాసోత్సవ కార్యక్రమాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ప్రత్యేకంగా ఘంటసాల 30 గేయాలకు కళాకారులు చేసిన నృత్యం ప్రేక్షకులను అలరించాయి. ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వర రెడ్డి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి తనికెళ్ల పార్థసారథి ఆదిలీలా ఫౌండేషన్ న్యూఢిల్లీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్ ఆదినారాయణ పాల్గొన్నారు. ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, ఆదిలీలా ఫౌండేషన్ న్యూఢిల్లీ, తెలుగు కళావాహిని శ్రీ కళాభారతి జిఆర్‌కె పోలవరం సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వర రెడ్డి కార్యక్రమానికి అధ్యక్షత వహించి మాట్లాడుతూ నవ్యాంధ్ర రాజధాని అమరావతిలో 25 అడుగుల ఘంటసాల భారీ విగ్రహాన్ని, మ్యూజియం ఏర్పాటు చేయాలన్నారు. ఎన్టీఆర్, ఘంటసాలకు భారతరత్న ప్రకటించాలని, ఘంటసాలకు సంబంధించి హైస్కూల్ విద్యార్థులకు ఒక పాఠ్యాంశంగా చేర్చాలన్నారు. ముఖ్య అతిథి అది లీలా ఫౌండేషన్ న్యూఢిల్లీ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్ ఆదినారాయణ మాట్లాడుతూ ఘంటసాల పాట నాడు, నేడు, రేపటి తరాలకు అందించాలని కోరారు. ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ ప్రధాన కార్యదర్శి తనికెళ్ల పార్థసారథి, కార్యదర్శి చింతకాయల చిట్టిబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా విజయవాడలో ప్రేక్షకులను అద్భుతంగా అలరించిన డాక్టర్ సయ్యద్ రహంతుల్లా ఘంటసాల 200వ గాన అవధానం ఘంటసాల పాటల కబడ్డీ ప్రేక్షకులు అలరించింది. 17 మంది ప్రముఖులు పృచ్ఛకులు వేసిన 50 ప్రశ్నలకు డాక్టర్ రహంతుల్లా సమాధానాలను ఎంతో ఉత్సాహంగా తెలిపారు. విశాఖపట్నంకు చెందిన 12 మంది నటులు, గాయకులు లఘు నాటికల ప్రదర్శనలో పాల్గొని ఘంటసాల స్వాతంత్ర ఉద్యమంలో పాల్గొన్న ఘటనలు, ఆయన జీవిత చరిత్ర, ముగింపుపై ఇచ్చిన ప్రదర్శనలు ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయి. విశాఖపట్నంకు చెందిన గాయని, గాయకులు, నటులు డాక్టర్ సయ్యద్ రహంతుల్లా, యు బి ఐ అరుణ్ కుమార్, ఎల్ఐసి ఏజెంట్ నారాయణమూర్తి, ఘంటసాల పాత్రధారి నందగోపాల్,పాల్గొన్నారు.